
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
ఆదివారం, 4 మే 2025

మైనర్ల బైక్ డ్రైవింగ్...

తల్లిదండ్రులకు జరిమానా

ఖమ్మం క్రైం, మే 3 (ఆంధ్రజ్యోతి): మైనర్లకు వాహనాలు ఇచ్చినందుకు ఏడుగురు మైనర్ల తల్లిదండ్రులకు ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున కోర్టు జరిమానా విధించింది. ఇటీవల నగరంలో వాహనాల తనిఖీలు చేస్తుండగా ఏడుగురు మైనర్లు పట్టుబడ్డారు. దీంతో వారి తల్లిదండ్రులపై కేసులు నమోదుచేసి శనివారం కోర్టులో హాజరుపరచగా, జడ్జి జరిమానా విధించినట్టు ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు తెలిపారు. అదేవిధంగా మద్యం తాగి వాహనం నడిపిన మరో వ్యక్తికి రూ.2500 జరిమానా విధించినట్టు తెలిపారు.

ప్రతిష్టాత్మకంగా యంగ్ ఇండియా స్కూల్స్


యంగ్ ఇండియా స్కూల్‌కు భూమిపూజ చేస్తున్న భట్టి

- అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తాం
- మెరికల్లాంటి విద్యార్థులను తయారు చేసేలా ప్రణాళిక
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- లక్ష్మీపురంలో స్కూల్ నిర్మాణానికి భూమిపూజ

మధిర టౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి): యంగ్ ఇండియా స్కూల్స్ తమ ప్రభుత్వ బ్రాండ్ అని, అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మించి మెరికల్లాంటి పౌరులను అందిస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా బోనకల్ మండలం లక్ష్మీపురంలో రూ.200 కోట్లతో నిర్మించే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి శనివారం భూమిపూజ చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గత పదేళ్ల అధికారంలో ఉన్న వారు విద్య, వైద్యాన్ని విస్మరించారని ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీటిని టాప్ ప్రియారిటీగా తీసుకుని మొదటి దశలో 58 స్కూల్స్‌ను మంజూరు చేశామని తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన అనేక విజ్ఞప్తులతో మరో 47 స్కూల్స్‌ను మంజూరు చేశామని రూ.21వేల కోట్లతో 105 స్కూల్స్ నిర్మాణానికి అంకురార్పణ చేశామని అన్నారు.

25 ఎకరాల విస్తీర్ణానికి తగ్గకుండా, అధునాతన సదుపాయాలతో అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ స్కూల్స్ నిర్మిస్తున్నామని ఈ స్కూల్స్‌లో ఐఐటీ, నీట్ వంటి పోటీ పరీక్షలకు విద్యార్థులు సిద్ధమయ్యేలా ఉపాధ్యాయులను నియమిస్తామని అన్నారు. స్కూల్‌లోనే టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ ఉండేందుకు క్వార్టర్స్ నిర్మిస్తామని, ఒక్క చదువే కాకుండా క్రీడలతో పాటు విభిన్న రంగాల్లో విద్యార్థులు రాణించేలా ఇండోర్, అవుట్ డోర్ స్టేడియాలు, యాంఫీ థియేటర్ నిర్మిస్తున్నామని అన్నారు. ఇంగ్లీష్ మీడియంలో 12వ తరగతి వరకు విద్యను అందించడం జరుగుతుందని, ఈ స్కూల్స్ నుంచి బయటకు వచ్చిన విద్యార్థులు మెరికల్లా ప్రపంచానికి ఉపయోగపడనున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, అడిషనల్ కలెక్టర్ శ్రీజ, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, డీఈవో సత్యనారాయణ ఇతర అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. కాగా, భట్టి తన పర్యటనలో ముదిగొండ మండలంలోని వల్లభి, బాణాపురం, మల్లన్నపాలెం, ముదిగొండ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.

అభివృద్ధి పనులు సత్వరమే పూర్తిచేయాలి


మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

- మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణపనులు వేగవంతం చేయండి
- రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు జరగాలి
- పర్యాటక అభివృద్ధి పనులపై విస్తృత ప్రచారం చేయండి
- 2026 జూన్ నాటికి ఖమ్మం ఖిల్లా రోప్‌వే ప్రాజెక్టు పూర్తికావాలి
- జాతీయ రహదారుల పనులు సత్వరం పూర్తిచేయండి
- అధికారుల సమీక్షా సమావేశంలో మంత్రి తుమ్మల

ఖమ్మం, మే 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు, పనులను వేగవంతంగా చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, పనులపై ఎంపీ రఘురాంరెడ్డితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు దశ, దిశ నిర్దేశించారు. శాఖలవారీగా పనులు సమీక్షించారు.

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ గతేడాది మున్నేరుకు భారీ వరదలు వచ్చాయని, నిపుణుల డిజైన్ దృష్టిలో పెట్టుకుని మున్నేరు నది రిటైనింగ్ వాల్ పనులు పక్కాగా జరగాలని, రాష్ట్రం ఆర్థిక ఇబ్బందులో ఉన్నా ఖమ్మం నగర వాసులు మున్నేరు వరదతో ఇబ్బంది పడవద్దని ముఖ్యమంత్రిని ఒప్పించి నిధులు మంజూరు చేయించడం జరిగిందన్నారు పనులు నాణ్యతతో సకాలంలో పూర్తయ్యేలా చూడాలని కోరారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు కింద సేకరించిన భూములను అభివృద్ధి చేసి మున్నేరు నది రిటైనింగ్‌వాల్ భూ నిర్వాసితులకు అందించేలా రైతులతో చర్చలు జరపాలని, అధికారులు ఆదేశించారు. రిటైనింగ్‌వాల్ పనులు రెండువైపులా ప్రణాళికాబద్ధంగా జరపాలన్నారు. 3 లక్షల 50వేల క్యూసెక్కుల వరద ఉధృతి తట్టుకునేలా 8.5 కి.మీ.పైగా మున్నేరు రిటైనింగ్ వాల్ జరుగుతున్న పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఈ రిటైనింగ్ వాల్ నిర్మాణానికి అవసరమైన భూ ప్రక్రియను వెంటనే చేపట్టాలన్నారు. నాగార్జునసాగర్ కాలువలో తెగిపోయిన యూటీ పనులను పునర్ నిర్మించాలని సూచించారు. ఈనెలలో ఎట్టి పరిస్థితుల్లో పనులు పూర్తి కావాలని ఆదేశించారు. మంచుకొండ లిఫ్టు వద్ద హెడ్ రెగ్యులేటరీ పనులకు ప్రతిపాదనలు చేయాలని కోరారు.

ఖమ్మం నగరంలోని అండర్ డ్రెయినేజీ కింద 8.5కి.మీ. మురుగునీటి కాలువను పూర్తిస్థాయిలో నిర్మించాలని, ఆక్రమణల (మిగతా 2వ పేజీలో)



నేడు చేకూరి కాశయ్య విగ్రహావిష్కరణ

కొత్తగూడెం, మే 3 (ఆంధ్రజ్యోతి) : 60 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో చేకూరి కాశయ్య ఉమ్మడి ఖమ్మం జిల్లాపై తనదైన ముద్ర వేశారు. కొత్తగూడెం సమితి అధ్యక్షుడిగా, ఎమ్మెల్యేగా, ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్‌గా పని చేశారు. గురుదక్షిణ ఫౌండేషన్ వ్యవస్థాపకుడిగా విశేష సేవలు అందించారు. ఆయన స్మారకార్థం కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన కాంస్య విగ్రహాన్ని ఆదివారం ఉదయం 10 గంటలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆవిష్కరించనున్నారు. ఈ సందర్భంగా జరిగే సభకు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధ్యక్షత వహిస్తారు. గౌరవ అతిథులుగా ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, భద్రాచలం ట్రస్ట్‌బోర్డు మాజీ చైర్మన్ తాళ్లూరి వెంకటేశ్వరరావు, మాజీ జడ్పీటీసీ కంచర్ల చంద్రశేఖర్, గురుదక్షిణ ఫౌండేషన్ చైర్మన్ జి.శంకరయ్య, డాక్టర్ సామినేని రాఘవులు, తాళ్లూరి పంచాక్షరయ్య, ప్రముఖ పారిశ్రామిక వేత్త చావా వేణుమాధవ్, మాచవరపు కోటేశ్వరరావు, శ్యామ్, వర్ధన్‌రావు, పాల్గొంటారని ఆహ్వాన సంఘం బాధ్యుడు బిక్కసాని నాగేశ్వరరావు తెలిపారు.

‘సీతారామ’ జలాల కోసం పోరాటం

ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతాంగానికి సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాల అందించాలనే డిమాండ్‌తో పోరాటం ఉధృతం చేస్తామని మాజీ ఎమ్మెల్యే, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి తెలిపారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా జిల్లా రైతాంగానికి సాగునీరు అందించాలని, పాత డిజైన్ ప్రకారం ప్రాజెక్టు నిర్మించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కొత్తగూడెంలో శనివారం ఓల్డ్ డిపో నుంచి పద్మశాలి కల్యాణ మండపం వరకు వందలాది మందితో ప్రదర్శన నిర్వహించారు.



కొత్తగూడెంలో సీపీఎం ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించిన నాయకులు

- భూములు తీసుకొని సాగునీరు ఇవ్వకపోవడం అన్యాయం
- ప్రాజెక్టు డిజైన్ ప్రకారమే ప్రాజెక్టు నిర్మించాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి
- కొత్తగూడెంలో భారీ ప్రదర్శన


మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి

కొత్తగూడెం, మే 3 (ఆంధ్రజ్యోతి): సీతారామ ప్రాజెక్టు ద్వారా జిల్లాకు సాగునీరు అందించాలని డిమాండ్ చేస్తూ కొత్తగూడెంలో జరిగిన సదస్సులో జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ జిల్లా రైతాంగానికి ఈ ప్రాజెక్టు వల్ల అన్యాయం జరిగిందని ఆరోపించారు. ప్రాజెక్టు కోసం సాగు భూములు ఇచ్చిన రైతులకే సాగునీరు ఇవ్వకుండా చేస్తారా అని ప్రశ్నించారు. ప్రాజెక్టు డిజైన్ మార్చడం వల్ల జిల్లాలో నిర్మించతలపెట్టిన రిజర్వాయర్లు లేకుండా పోయాయని ఇది ప్రజలకు చేసిన తీవ్ర అన్యాయమన్నారు. జిల్లా రైతాంగం రాజకీయాలకతీతంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి స్పందించి పూర్తిస్థాయిలో విచారణ జరిపి పాత డిజైన్ ప్రకారం ప్రాజెక్టు నిర్మించాలని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ కొత్తగూడెం జిల్లాకు జరుగుతున్న అన్యాయంపై జిల్లాలో ఉన్న ఎమ్మెల్యేలు, ఎంపీలు స్పందించాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గోదావరి జలాల సాధన కోసం సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం నాయకత్వంలో మహాప్రస్థానం పాదయాత్ర వందరోజులు 2,600 కిలోమీటర్లు చేశామన్నారు. జిల్లాలో పక్కనే గోదావరి ఉన్నప్పటికీ జిల్లా రైతులు సాగునీరు లేక అవస్థలు పడుతున్నారని సీపీఎం సాగునీటి ప్రాజెక్టుల కోసం గతంలో కూడా పోరాటం చేసిందని గుర్తు చేశారు. సీతారామ ప్రాజెక్టు డిజైన్ మార్చి గోదావరి జలాలను తరలించుకుపోతుంటే చూస్తూ ఊరుకోవద్దని సాగునీటి సాధనకు మరో ఉద్యమం చేద్దామని పిలుపునిచ్చారు. జిల్లాలో ఉన్న చెరువులన్నింటికీ సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి నీటి సరఫరా చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య, ఏజే రమేష్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నర్సారెడ్డి, కొక్కెరపాటి పుల్లయ్య, కారం పుల్లయ్య, లిక్కి బాలరాజు, అన్నవరపు సత్యనారాయణ, రేపాకుల శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు కున్సోత్ ధర్మా, కొండపల్లి శ్రీధర్, నబి, స్వామి, భూక్య రమేష్ మండల కార్యదర్శులు కొమరం కాంతారావు, ఆలేటి కిరణ్, ఈసం నర్సింహారావు, పాకాల వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల జాబితాపై రగడ

- తమ పేర్లు లేవంటూ వాటర్‌ట్యాంక్ ఎక్కిన గిరిజనులు
- అనర్హులకు మంజూరు చేశారని ఆరోపణ
- బేతాళపాడులో రెండు గంటలకు పైగా ఉద్రిక్తత
- పోలీసులు, పంచాయతీ కార్యదర్శి హామీతో ఆందోళన విరమణ
- ఏడుగురిపై కేసు నమోదు చేసిన పోలీసులు


బేతాళపాడులో వాటర్‌ట్యాంక్ ఎక్కి ఆందోళన చేస్తున్న గిరిజనులు

జూలూరుపాడు, మే 3 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో పారదర్శకత లోపించిందని, అర్హులైన తమకి మొదటి విడతలో మంజూరు చేయకుండా అనర్హులకు ఇళ్లను ఇచ్చారని ఆరోపిస్తూ గిరిజనులు వాటర్ ట్యాంక్ ఎక్కి ఆందోళనకు దిగిన సంఘటన భద్రాద్రి జిల్లా జూలూరుపాడు మండలం బేతాళపాడు గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకెళితే. బేతాళపాడు పంచాయతీ పరిధిలో గతంలో నిర్వహించిన గ్రామసభలో 519 మందిని ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు అర్హులుగా గుర్తించి ఎల్-1 జాబితాను అధికారులు రూపొందించారు. కాగా వారిలో మొదటి విడతలో 42 మందికి ఇళ్లను మంజూరు చేస్తూ జాబితాను (మిగతా 2వ పేజీలో)

కార్పొరేట్ సెలూన్లు వద్దు..

- త్వరలో నగరంలో భారీ ధర్నా
- నాయీ బ్రాహ్మణ సంఘం నేతలు

2


భద్రగిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్న దృశ్యం

మారుమోగిన రామ నామం

- తిరువడితో శ్రీరామదీక్షితుల గిరి ప్రదక్షిణ
- ముగిసిన శ్రీరామ పునర్వసు దీక్ష
- వైభవోపేతంగా రథోత్సవం
- నేడు రామయ్యకు పట్టాభిషేకం

భద్రాచలం, మే 3 (ఆంధ్రజ్యోతి): 27 రోజుల పాటు భక్తిప్రపత్తులతో శ్రీరామ పునర్వసు దీక్షను నిర్వహించిన శ్రీరామదీక్షితులు తమ ఆరాధ్య దైవమైన రామయ్య సన్నిధిలో శనివారం దీక్షలు విరమించారు. జైశ్రీరామ్.. జైజై శ్రీరామ్... శ్రీరామ... జయ రామ.. జయ జయ రామ.. అంటూ శ్రీరామ దీక్షితులు చేసిన రామ నామస్మరణతో భద్రగిరి పులకరించింది. శనివారం శ్రీరామ పునర్వసు దీక్ష ముగిసిన తరుణంలో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి తరలివచ్చిన శ్రీరామదీక్షితులతో భద్రాద్రి పురవీధులు రామనామ స్మరణతో మారుమోగాయి. వేకువ జాము నుంచే భక్తులు పవిత్ర గోదావరికి చేరుకొని పుణ్యస్నానాలు ఆచరించి తమ ఆరాధ్య దైవమైన రామయ్యను దర్శించుకున్నారు. అనంతరం రామాలయంలోని నిత్యకల్యాణ మండపం ఆవరణలో శ్రీరామదీక్షితులు దేవస్థానం అందజేసిన తిరువడి సామగ్రితో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి తిరువడి ధారణ చేసి భద్రగిరి ప్రదక్షిణ మూడుసార్లు నిర్వహించారు. గిరి ప్రదక్షిణ అగ్రభాగాన భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం (మిగతా 2వ పేజీలో)

కొత్త పాఠ్య పుస్తకాలు వస్తున్నాయి

- వివిధ తరగతుల విద్యార్థులకు కావల్సిన పుస్తకాలు 6,59,570
- మొదటి విడతలో చేరుకున్న పుస్తకాల సంఖ్య 2,55,690
- జిల్లా కేంద్రంలోని స్టాక్ పాయింట్‌లో భద్రపరుస్తున్న అధికారులు
- కొత్త పుస్తకాల్లో తెలంగాణ రాష్ట్ర గీతం ముద్రణ

ఖమ్మం ఖానాపురం హవేలి, మే 3 (ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాల సరఫరా మొదలైంది. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు మొత్తం 6 లక్షల 59 వేల పాఠ్యపుస్తకాలు అవసరం కాగా, మొదటి విడతలో శనివారం నాటికి 2లక్షల 55వేల పుస్తకాలు చేరాయి. 2లక్షల 37వేల పుస్తకాలను నెలాఖరులోగా సరఫరా చేయనున్నారు. రెండో దఫా పుస్తకాలను ఆగస్టు చివరి నాటికి సరఫరా చేయనున్నట్టు అధికారులు తెలిపారు. జిల్లా కేంద్రంలోని స్టాక్ పాయింట్‌లో పుస్తకాలను భద్రపరిచి విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే విద్యార్థులకు అందించేలా అధికార యంత్రాంగం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

ఈ ఏడాది కొత్తగా పాఠ్యపుస్తకాల్లో తెలంగాణ తల్లి నూతన విగ్రహం, తెలంగాణ రాష్ట్ర గీతం, భారత రాజ్యాంగ ఉపోద్ఘాతం ముద్రించారు. గతేడాది పాఠ్యపుస్తకాల పంపిణీ ఆలస్యం కావడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని విద్యాశాఖ ఈ ఏడాది ముందుగానే పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టింది. విద్యార్థులు పాఠశాలకు వచ్చిన రోజే పుస్తకాలు, యూనిఫామ్ అందించేలా చర్యలు చేపడుతున్నారు. 2 నుంచి 9 తరగతుల వరకు తెలుగు, ఆంగ్ల మీడియం కంబైండ్ పాఠ్యపుస్తకాలు, 1వ తరగతి, 10వ తరగతికి ప్రత్యేకంగా తెలుగు, ఆంగ్ల మీడియం వేర్వేరుగా అందించనున్నారు. నెలాఖరుకు అన్ని తరగతులకు కావాల్సిన పుస్తకాలు అందుబాటులోకి రానున్నాయి.

1699 పాఠశాలలు..

ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 1,699 ప్రభుత్వ, ప్రభుత్వ ఆధీనంలో నడిచే పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 1,161 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, 14 కేజీబీవీలు, మోడల్ స్కూల్స్ 2 ఉన్నాయి. అర్బన్ రెసిడెన్షియల్ ప్రైమరీ, హైస్కూల్ పాఠశాల, బీసీ గురుకులాలు, మైనారిటీ గురుకులాల పాఠశాలల్లో సుమారు 79,490 మంది విద్యార్థులు చదువుతున్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి 6,59,570లక్షలకు పైగా పాఠ్య పుస్తకాలు అవసరమని జిల్లా విద్యాశాఖ అధికారులు అంచనా వేశారు. కాగా ఈ పాఠ్యపుస్తకాలపై బార్ కోడ్ ముద్రిస్తున్నారు. పేద విద్యార్థులకు ఉచితంగా అందజేసే పాఠ్యపుస్తకాలు పక్కదారి పట్టకుండా నిర్దేశించిన వారికే అందించేందుకు అధికార యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది.


గోదాములో పాఠ్యపుస్తకాలు

ఆర్టీసీ కార్గోకు బైబై

ఆర్టీసీకి ఆదాయం పెంపొందించడంలో భాగంగా ఏర్పాటు చేసిన కార్గో బస్ సర్వీసులతో గత మూడేళ్లలో పాఠ్యపుస్తకాలు తరలించారు. కానీ ఈ ఏడాది కార్గోకు గుడ్‌బై చెప్పి ప్రైవేటు ట్రాన్స్‌పోర్ట్ వాహనాలను వినియోగిస్తున్నారు. ఈ వాహనాల్లోనే జిల్లా కేంద్రంలోని స్టాక్ పాయింట్ నుంచి మండల కేంద్రాలకు కూడా పాఠ్యపుస్తకాలను తరలించనున్నారు. కార్గోను వదిలేయడంలో ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యం ఉందా లేక విద్యాశాఖ అధికారుల సొంత నిర్ణయమా అనేది తెలియదు.

ప్రారంభం రోజే ఇస్తాం: డీఈవో, ఖమ్మం

2025-26 విద్యాసంవత్సరం మొదటి రోజే విద్యార్థులకు పూర్తిస్థాయి పాఠ్యపుస్తకాలు, రెండు జతల యూనిఫామ్, పాఠశాల ప్రారంభం రోజే ఇచ్చేందుకు చర్యలు చేపట్టాం.

నేడు ‘నీట్’ పరీక్ష

- 6 పరీక్షా కేంద్రాలు.. 2739 మంది అభ్యర్థులు

ఖమ్మం కలెక్టరేట్, మే 3 (ఆంధ్రజ్యోతి) : వైద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం ఆదివారం జరగనున్న నీట్ యూజీ ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేశారు. పరీక్ష కేంద్రాలకు అభ్యర్థులు సకాలంలో చేరుకోవాలని జిల్లా నోడల్ ఆఫీసర్, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి కోరారు. ఖమ్మంలో ఎస్సార్‌బీజీఎన్నార్ కళాశాల, శాంతినగర్ హైస్కూల్, ఏఎస్పీ కాలనీ స్కూల్, ప్రభుత్వ మహిళా కళాశాల, యూనివర్శిటీ పీజీ కాలేజీ, కేంద్రీయ విద్యాలయం పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు పరీక్ష జరుగుతుంది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 2,739 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. కేంద్రాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల వసతులు కల్పించారు. పరీక్షకు ఒక రోజు ముందే పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 నిమిషాల వరకు విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతి ఇస్తారు. మధ్యాహ్నం 1.30 నిమిషాలకు గేట్ మూసి వేస్తారు. అభ్యర్థులు తప్పనిసరిగా మధ్యాహ్నం 1.30 లోపే పరీక్ష కేంద్రానికి చేరుకోవాల్సి ఉంటుంది.

తొలి త్రైమాసికంలో 160 లక్షల టన్నుల బొగ్గు

ఉత్పత్తి సాధించాలి

- మహిళలతో ఒక ఓసీ, ఒక యూజీని నిర్వహించాలి
- జీఎంలతో సమీక్షలో సింగరేణి సీఎండీ బలరాం

కొత్తగూడెం, మే 3 (ఆంధ్రజ్యోతి): ఈ ఆర్థిక సంవత్సరంలో ఉత్పత్తికి పూర్తిగా అనుకూలంగా ఉండే మొదటి త్రైమాసిక కాలాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకుని 160టన్నుల బొగ్గు ఉత్పత్తిని, 1200 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్‌ను తొలగించాలని ఏరియాల జనరల్ మేనేజర్లను సింగరేణి సీఎండీ ఎన్.బలరాం ఆదేశించారు. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో శనివారం జరిగిన అన్ని ఏరియాల సమీక్ష సమావేశంలో ఉత్పత్తి, బొగ్గు రవాణా తదితర అంశాలపై సీఎండీ సమీక్షించారు. గత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్‌లో సాధించిన బొగ్గు రవాణా 5.66 మిలియన్ టన్నులపై 2.7 శాతం వృద్ధితో ఈ ఏప్రిల్‌లో 5.81 మిలియన్ టన్నుల బొగ్గు రవాణా సాధించామని, గతేడాది ఏప్రిల్‌లో సాధించిన 36.18 మిలియన్ క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్‌పై 10.6శాతం వృద్ధితో ఏప్రిల్‌లో 40మిలియన్ క్యూబిక్ మీటర్ల ఓబీ తొలగించామన్నారు. ఇదే ఒరవడిని కొనసాగిస్తూ లక్ష్యాలు సాధించాలని ఛైర్మన్ సూచించారు. ఒడిశా రాష్ట్రంలో కొత్తగా ప్రారంభించిన నైనీ బొగ్గు బ్లాకులో పని చేసేందుకు సూపర్‌వైజర్లు, సిబ్బందిని ఎంపిక చేసి నెల రోజుల్లోగా అక్కడికి పంపించాలని ఆదేశించారు. సింగరేణి సంస్థలో మహిళా ఉద్యోగినుల సంఖ్య పెరిగిన రీత్యా వీరి నిర్వహణలో ఒక ఓపెన్‌కాస్టు గనిని, ఒక భూగర్భ గనిని ఎంపిక చేసి, ముందుగా ఒక పూర్తి షిఫ్టును కేవలం మహిళలతోనే నిర్వహించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బొగ్గు రవాణా, నాణ్యతపై కూడా సీఎండీ సమీక్షించారు. నాణ్యతపై కిందిస్థాయి నుంచి పైస్థాయి అధికారుల వరకు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పూర్తి పని గంటలు సద్వినియోగం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సంస్థ డైరెక్టర్లు, డైరెక్టర్ (ఈఅండ్‌ఎం) డి.సత్యనారాయణరావు, డైరెక్టర్ ఆపరేషన్స్ ఎల్‌వి.సూర్యనారాయణ, డైరెక్టర్ (పీపీ, పర్సనల్) కే.వెంకటేశ్వర్లు, జీఎం (సీపీపీ) ఎ.మనోహర్, అడ్వైజర్ ఫారెస్ట్రీ మోహన్‌చంద్ర పరిగెన్, జీఎం మార్కెటింగ్ రాజశేఖరరావు, కార్పొరేట్ జీఎంలు, అన్ని ఏరియాల జీఎంలు పాల్గొన్నారు.

వర్షపు నీటిని ఒడిసి పట్టేందుకే

ఇంకుడు గుంతలు

- పలుగు, పార పట్టి గుంత తవ్విన కలెక్టర్
- తట్ట ఎత్తిన అదనపు కలెక్టర్



ఇంకుడు గుంతను తవ్వుతున్న కలెక్టర్



గుంతను రాళ్లతో నింపుతున్న దృశ్యం

బూర్గంపాడు, మే 3 (ఆంధ్రజ్యోతి): ప్రతి వర్షపు నీటి చుక్కను ఒడిసి పట్టేందుకే ఇంకుడు గుంత తప్పని సరిగా నిర్మించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ఇంకుడు గుంతలపై అవగాహన కల్పించి స్వయంగా పలుగు, పారా పట్టి గుంతను తవ్వగా అదనపు కలెక్టర్ తట్టతో మట్టిని ఎత్తిపోశారు. శనివారం కలెక్టర్ బూర్గంపాడు మండల పరిధిలో విస్తృతంగా పర్యటించారు. బూర్గంపాడులోని తెలంగాణ మైనారిటీ బాలికల పాఠశాలను సందర్శించారు. 'జల్ సంచెయ్ జన్ భాగీ' దారిలో ప్రతి ప్రభుత్వ కార్యాలయం, వసతి గృహలు, ఆస్పత్రులు, పాఠశాలల ఆవరణలో ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలన్నారు. కలెక్టర్ స్వయంగా పలుగు, పారా పట్టి గుంతను తవ్వడం ప్రారంభించారు. కలెక్టర్ వెంట ఉన్న స్థానిక సంస్థల కలెక్టర్ విద్యాచందన, అధికారులు తట్టలతో మట్టిని ఎత్తిపోశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భవిష్యత్తు తరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరు ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవాలన్నారు. పాఠశాల ప్రాంగణం పరిశీలించి సమస్యలు ఉన్నాయా అని తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణలో ఒక డార్మిటరీ హాలు, రెండు తరగతి గదులు నిర్మించడానికి తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని సీపీవో సంజీవరావును ఆదేశించారు. పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించినందుకు గాను ప్రిన్సిపాల్ గీత జ్యోతిని అభినందించారు. అనంతరం నాగినేనిప్రోలు గ్రామ పంచాయతీలోని నర్సరీని, లక్ష్మీపురం గ్రామంలో ఉపాధి హామీ ద్వారా పండిస్తున్న మునగ సాగును పరిశీలించి హర్షం వ్యక్తం చేశారు. సారపాకలోని పాఠశాల పిల్లల ఏకరూప దుస్తుల తయారీ కేంద్రాన్ని పరిశీలించారు.కలెక్టర్ వెంట పర్యటనలో తహసీల్దార్ ముజాహిద్, ఎంపీడీవో జమలారెడ్డి, ఎంఈవో యదుసింహరావు, సీడీపీవో రేవతి, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, పీహెచ్‌సీ సిబ్బంది, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న మంత్రి తుమ్మల

లబ్ధిదారుల ఇంటి వద్దకే కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు

వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం, మే 3 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): లబ్ధిదారుల వద్దకే కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులు ఏవైనా లబ్ధిదారుల ఇంటివద్దనే ఇవ్వడం జరుగుతుందని క్యాంపు కార్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలకు తిరగాల్సిన అవసరంలేదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం మంత్రి తుమ్మల క్యాంపు కార్యాలయంలో రూ.కోటి 63లక్షల విలువైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను, రూ.9.30లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంత్రి లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ లబ్ధిదారులు ఎవరు క్యాంపు కార్యాలయాలు, ఆఫీసులకు రావాల్సిన అవసరంలేదని, మీ ఇంటికి వచ్చి మీ చేతికి చెక్కులను అందిస్తారని వెల్లడించారు. అనంతరం లబ్ధిదారులకు చెక్కులు అందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కమర్తపు మురళి, సొసైటీ అధ్యక్షుడు రావూరి సైదాబాబు, మలీదు వెంకటేశ్వర్లు లకావత్ సైదులు, పల్లెబోయిన చంద్రం కాంగ్రెస్ నాయకులు సాధురమేష్‌రెడ్డి, మిక్కిలినేని నరేంద్ర, పాలెపు వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

వెంగళరావు ప్రాజెక్టు అలుగుకు మోక్షం

- జాతీయ ఎస్టీ కమిషన్ జోక్యంతో కదిలిన ప్రభుత్వం
- రూ.33.55 కోట్లు మంజూరు చేస్తూ పాలనాపరమైన అనుమతులు



అలుగుకు భారీ గండి పడిన దృశ్యం (ఫైల్)

చంద్రుగొండ, మే 3(ఆంధ్రజ్యోతి): అత్యంత నీటి వనరులతో ఎనిమిది గ్రామాలకు జీవనాడీగా ఉన్న వెంగళరావు ప్రాజెక్టు అలుగు పునర్నిర్మాణానికి ఎట్టకేలకు మోక్షం లభించింది. గత, ప్రస్తుత ప్రభుత్వాల్లోని ఇద్దరు ఎమ్మెల్యేలు అలుగు నిర్మాణానికి ఇచ్చిన హామీలు నెరవేర్చలేక పోయారు. కానీ జాతీయ ఎస్టీ కమిషన్ జోక్యంతో ప్రభుత్వం కదిలివచ్చింది. ఈ మేరకు రూ.33.55కోట్లు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. కాగా త్వరలో టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని డీఈ కృష్ణశంకర్ తెలిపారు.

ఎనిమిది గ్రామాలకు జీవనాడీ

చంద్రుగొండ మండలంలోని సీతాయిగూడెం దామరచర్ల గ్రామాల మధ్య ఉన్న వెంగళరావు ప్రాజెక్టు ఎనిమిది గ్రామాలకు జీవనాడీగా ఉంది. ప్రాజెక్టు ద్వారా అధికారికంగా రెండువేల రెండు వందల ఎకరాలకు.. అనధికారికంగా మరో వెయ్యి ఎకరాలకు రెండు పంటలకు సాగునీరు అందుతుంది. దీనికితోడు చేపలవేట నిర్వహిస్తూ 120 కుటుంబాలు జీవిస్తున్నాయి. అంతేకాకుండా ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు అడుగంటకుండా దోహదపడుతోంది. ఐదేళ్ల క్రితం సంభవించిన వరదల కారణంగా మూడువందల మీటర్లకుపైగా ఉన్న అలుగు పూర్తిగా ధ్వంసమైంది. దాంతో ప్రాజెక్టులో నీటి నిల్వ ఉండడం లేదు. వర్షాకాలంలో మొదటి పంటకే నీరు అందని పరిస్థితి నెలకొంది. అలుగు నిర్మించాలని రైతులు, రైతు సంఘాలు అనేకమార్లు ఆందోళనలు నిర్వహించాయి. దీనిపై గత, ప్రస్తుత ఎమ్మెల్యేలు హామీలైతే ఇచ్చారు.. కానీ వాటిని నెరవేర్చలేదు. అయితే మాజీ మంత్రి జలగం ప్రసాదరావుతో పాటు ఈ ప్రాంత రైతులు జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో మార్చి నెలలో కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్ ప్రాజెక్టును సందర్శించారు. నెల రోజుల్లో అలుగు మరమ్మతులు చేపట్టకుంటే నీటిపారుదల కార్యదర్శి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఢిల్లీలోని కమిషన్ ఎదుట హాజరుకావాల్సి ఉంటుందని హెచ్చరించారు. దీంతో ఆగమేఘాల మీద నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ధాన్యం కొనుగోళ్లలో జాప్యం

- దళారులను తక్కువ ధరకు విక్రయిస్తున్న రైతులు



పెద్దకోరుకొండిలో దళారులకు ధాన్యం విక్రయిస్తున్న రైతులు

కల్లూరు, మే3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి తీవ్రమైన జాప్యం ఫలితంగా గత్యంతరంలేని పరిస్థితుల్లో బాధిత రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా భావించిన దళారులు పలు గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కేంద్రాల్లోనే నేరుగా ప్రవేశించి రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నారు. ఈ ఏడాది యాసంగి సీజన్‌లో వరి పంట పుష్కలంగా పండింది. దీంతో వరి పంట కూడా జిల్లాలో ఇతర మండలాల కంటే కల్లూరు మండలంలో ముందస్తుగా దిగుబడి అయింది. గత మార్చి నెల 15 నుంచి దిగుబడి కాగా అప్పటిలో ప్రభుత్వ కేంద్రాలు ఏర్పాటు కాలేదు. మరో వైపున రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించి పచ్చి ధాన్యాన్ని ఎక్కువ శాతం అమ్ముకున్నారు. ఇలా మండల పరిధిలోని యర్రబోయనపల్లి, రఘునాథబంజర, లింగాల, చంద్రుపట్ల గ్రామాల్లో పచ్చి ధాన్యాన్ని అమ్ముకున్నారు. ఇక ఏప్రిల్ నెలలో దిగుబడి అయిన ధాన్యాన్ని మద్దతు ధరకు అమ్ముకుందామని ఎంత ఆశపడ్డా రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ఆశ్రయిస్తే పలు రకాల కారణాలతో రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరిగింది. రోజుల తరబడిగా కేంద్రాల్లో రాశుల వద్ద పడిగాపులు పడ్డ ఫలితం లేక పలువురు రైతులు తక్కువ ధరకే ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకున్నారు. మరో వైపున ఈదురు గాలి అకాల వర్షాలు వెంటడటంతో రైతులు ఆందోళనలో పడి గత్యంతరం లేక దళారులకు ధాన్యం అమ్ముకునేందుకు సిద్ధపడ్డారు. ఈ పరిస్థితుల్లో మండల పరిధిలోని పుల్లయ్యబంజర ఐకేపీ కేంద్రంలో గత నాలుగు రోజుల క్రితం నుంచి ధాన్యం కాంటాలు నిలిచిపోవడంతో దళారులు రంగ ప్రవేశం చేసి తక్కువ ధరకు ధాన్యాన్ని కొంటున్నారు. వాస్తవంగా ప్రభుత్వం మద్దతు ధరను గమనిస్తే 77 కేజీల బస్తా ధాన్యం రూ.1700 కాగా, ప్రైవేట్ వ్యాపారులు అదే 77 కేజీల బస్తా ధాన్యం రూ.1470 కి కొనుగోలు చేస్తున్నారు. ఇలా దళారులకు ధాన్యం అమ్మడంతో మద్దతు ధరతో పాటుగా ప్రభుత్వం తరుపున రైతులు క్వింటాకు రూ.500 బోనస్‌ను కూడా కోల్పోవాల్సి వస్తుందని పలువరు రైతులు వాపోతున్నారు. ఈ నెల రోజుల్లో వాతారణం పరిస్థితుల అనుకూలించక ఈదరు గాలి, అకాల వర్షాలు వచ్చే ఆవకాశం ఉందని వాతరణ శాఖ సమాచారంతో రైతులు భయాందోళనకు గురియై ప్రైవేట్ వ్యాపారులకు తమ ధాన్యం అమ్ముకుంటున్నారు. ఇప్పటికే మండలంలోని పలు గ్రామాల్లో రైతులు 50 శాతం వరకు ప్రైవేట్ వ్యాపారులకు ధాన్యం అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఇందిరమ్మ ఇళ్ల జాబితాపై రగడ

(మొదటి పేజీ తరువాయి)

రూపొందించారు. దీంతో బేతాళపాడు గ్రామానికి చెందిన ధారావత్ బాలు, చౌడం వెంకటేశ్వర్లు, రేగళ్లతండాకు చెందిన బానోత్ కళ్యాణ్, బానోత్ కవిత, బానోత్ సునీత, బానోత్ బిందు, ధారావత్ నాగమణిలు తమ పేర్లు ఎల్-1 జాబితాలో ఉన్నప్పటికీ ఇళ్లు మంజూరు చేయకుండా అన్యాయం చేశారంటూ బేతాళపాడు గ్రామంలోని వాటర్ ట్యాంక్ ఎక్కి ఆందోళనకు దిగారు. తమకు ఇళ్లను మంజూరు చేసి న్యాయం చేసే వరకు ట్యాంక్ దిగమని తెలిపారు. దీంతో విషయం తెలుసుకున్న ఏఎస్ఐ మల్లయ్య, పోలీస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి ఇస్మాయిల్‌లు సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులకు నచ్చజేప్పేందుకు ప్రయత్నించారు. అయినప్పటికీ వారు కిందకు దిగిరాలేదు. రెండు గంటలకు పైగా ఆందోళన కొనసాగించారు. మరోసారి పోలీసులు వారితో మాట్లాడారు. మీ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేసే విధంగా కృషి చేస్తామని హామీ ఇవ్వటంతో గిరిజనలు వాటర్‌ట్యాంక్ దిగి కిందకు వచ్చి తమ ఆందోళను విరమించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లబ్దిదారుల జాబితాను రద్దు చేసి అర్హులైన తమని ఎంపిక చేయ్యాలని డిమాండ్ చేశారు. ఇటీవల వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ తమ ఇంట్లో సన్నబియ్యంతో భోజనం చేశారని, తన ఇల్లు సరిగాలేదని గమనించి ఇందిరమ్మ ఇల్లు కచ్చితంగా మంజూరీ చేస్తానని హామీ ఇచ్చి కూడా ఇల్లు మంజూరీ చేయకుండా అన్యాయం చేశారని గిరిజన మహిళా ధారవత్ నాగమణి ఆరోపించారు.

ఏడుగురు వ్యక్తులపై కేసు నమోదు

ఇందిరమ్మ ఇళ్ల అర్హుల జాబితాలో తమ పేర్లు లేవని వాటర్ ట్యాంకు ఎక్కి ఆత్మహత్యలు చేసుకుంటామని బెదిరింపులకు పాల్పడిన ఏడుగురు వ్యక్తులపై జూలూరుపాడు పోలీస్‌స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. ఎస్ఐ దారావత్ రవి తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. బేతాళపాడు,రేగళ్ల తండ గ్రామాలకు చెందిన చౌడం వెంకటేశ్వర్లు, బాణోత్ కళ్యాణ్, బాణోత్ కవిత, దారావత్ నాగమణి, బాణోత్ బిందు, బాణోత్ సునిత, దారావత్ బాబులు వాటర్ ట్యాంకు ఎక్కి తక్షణమే తమ పేర్లను ఇందిరమ్మ ఇళ్ల మంజూరీ జాబితాలో చేర్చాలని లేకుంటే పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంటామని బెదిరింపులకు పాల్పడ్డారని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి, అధికారులు బ్రతిమిలాడినప్పటికి ట్యాంకు పై నుంచి వారు కిందికి దిగకుండ విధులకు ఆటంకం కలిగించారు. పంచాయతీ కార్యదర్శి ఇస్మాయిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మంత్రుల పర్యటన రద్దు

మధిరటౌన్, మే3(ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు భారీ నీటి పారుదల శాఖమంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆదివారం మధిర పట్టణంలో చేపట్టనున్న పర్యటన రద్దు అయ్యింది. కాగా ఇంతకు ముందు వెల్లడించిన విధంగా కేవలం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాత్రమే మధిరలో పర్యటినలో పాల్గొననున్నారు. మధిర మునిసిపాలిటీలో రూ.128 కోట్లతో నిర్మించనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు భూమిపూజ కార్యక్రమంలో భట్టి పాల్గొననున్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు



క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

ఎర్రుపాలెం, మే3 (ఆంధ్రజ్యోతి): మండలంలో గల వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారికి శనివారం సర్వాంగాభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపించారు. భక్తులకు అన్నవితరణ చేశారు. ఈకార్యక్రమంలో ఈవో జగన్మోహన్‌రావు, ఆలయ ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ విజయకుమారి, జూనియర్ అసిస్టెంట్ ఇరకులపాటి కృష్ణప్రసాద్, అర్చకులు రాజీవ్‌శర్మ, మురళీమోహన్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు సత్వరమే పూర్తిచేయాలి

(మొదటి పేజీ తరువాయి)

తొలగింపునకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఖమ్మంనగరంలో మురుగునీటి ద్వారా గార్డెనింగ్ మొక్కలపెంపకం, ఇతర అవసరాలకు వినియోగించుకోవాలన్నారు. రైస్‌మిల్లర్లపై అధికారులకు కమాండ్ ఉండాలని, కొనుగోలు కేంద్రాల వద్ద లారీలు రాక ధాన్యం కొనుగోలులో సమస్యలు వస్తున్నాయని వీటిని సత్వరం పరిష్కరించాలని సూచించారు. అకాలవర్షాలతో రైతులు నష్టపోతున్నారని, రవాణ కాంట్రాక్టర్లతో చర్చించి ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద అవసరమైన వాహనాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

వెలుగుమట్ల అర్బన్‌పార్కులో జరుగుతున్న అబివృద్ధి పనులకు విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. జిల్లాలో ఆర్‌అండ్‌బీ ,పీఆర్ ఇరువైపులా ప్రణాళికాబద్ధంగా మొక్కలునాటాలన్నారు. ఖమ్మం ఖిల్లా రోప్‌వే రోడ్డును సాధ్యమైనంతగా విస్తరించాలని, ఖిల్లా రోప్ పనులు నిర్ణీత సమయంలో పూర్తిచేయాలని కోరారు. జిల్లా కలక్టరేట్ వరకు జాతీయ రహదారినుంచి సర్వీసు రోడ్లు వచ్చేలా కృషిచేయాలని ధంసలాపురం ఎగ్జిట్ దగ్గర రైల్వేలైన్ వద్ద బ్రిడ్జినిర్మాణంకు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా వైద్యకళాశాల నిర్మాణ పనులకు త్వరలో శంకుస్థాపన జరగనుందని, జిల్లా ప్రధాన ఆసుపత్రికి అనవరమైన పనులకు, సదుపాయాలకు ప్రతిపాదనలు అందించాలన్నారు.

ఎంపీ రఘురాంరెడ్డి మాట్లడుతూ మున్నేరు వాల్ పనులనుప్రతిరోజు పరిశీలించాలని సంబంధిత ఏజెన్సీలకు సూచించారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ మున్నేరు రిటైనింగ్‌వాల్ నిర్మాణంలో భూసేకరణ కోసం రైతులతో చర్చలు జరుపుతున్నామని, తెలిపారు. సాగర్ మిగులు భూములను అబివృద్ధి చేసి రైతులకు ఇచ్చేలా ఒప్పిస్తామన్నారు. జిల్లాలో 351 కొనుగోలు కేంద్రాల ద్వారా 91వేల మె.ట.ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని, బోనస్ కింద రూ.12కోట్లు చెల్లించామన్నారు. అదనపు కలెక్టర్ శ్రీజ మాట్లాడుతూ రూపీ.29కోట్లతో ఖమ్మంఖిల్లా రోప్‌వే రూపకల్పన చేశామని తెలిపారు. ఇప్పటికే భూసార పరీక్షలు పనులు పూర్తిచేశామని, తెలిపారు. డీఎఫ్‌వో సిద్ధార్థ విక్రంసింగ్ మాట్లాడుతూ వెలుగుమట్ల అర్బన్ పార్కు అబివృద్ధికి రూ.3కోట్లతో బటర్‌ఫ్లై పార్కు, చిల్డ్రన్‌పార్కు, వాటర్ ఫౌంటెన్, బోటింగ్ పనులు ఈనెలాఖరు వరకు పూర్తవుతాయన్నారు. హరితనిధి కింద వచ్చిన1.28కోట్లతో పార్కులోని 110హెక్టార్ల భూమి పెన్సింగ్ ఇతర పనులు చేపడుతున్నామన్నారు. 4.5కి.మీసైకిల్ ట్రాక్ పూర్తిచేశామని వివరించారు. ఈ సమావేశంలో పలుశాఖల జిల్లా అదికారులు పాల్గొన్నారు.

కార్పొరేట్ సెలూన్లు వద్దు..

- నాయీ బ్రాహ్మణ సంఘం నేతలు

ఖమ్మం మార్కెట్, మే 3 (ఆంధ్రజ్యోతి): నగరంలో కొంతమంది ప్రైవేటు పెట్టుబడిదారులు కార్పొరేట్ తరహాలో సెలూన్లను ఏర్పాటు చేస్తుండటంతో తమ ఉపాధికి నష్టం కలుగుతోందని నగర నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ సెలూన్ల వల్ల సంప్రదాయ నాయీ బ్రాహ్మణుల షాపులు మూతపడే పరిస్థితి వచ్చిందని, దీంతో వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కుంటున్నారని తెలిపారు. కార్పొరేట్ సెలూన్ల ఏర్పాటును నిరసిస్తూ త్వరలో తాము చేపట్టబోయే భారీ ధర్నా కార్యక్రమానికి మద్ధతు ప్రకటించాలని కోరుతూ బీఆర్ఎస్ పార్టీ నేతలకు శనివారం వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, నాయీ బ్రాహ్మణ సంఘం జేఏసీ అధ్యక్షుడు యలమందల జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్నకు మద్దతు ధరేది..

- కొనుగోళ్లలో దళారుల దందా
- పెరిగిన పెట్టుబడులు
- జాడలేని కొనుగోలు కేంద్రాలు



జూలూరుపాడు, మే 3(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పండించిన పంటను విక్రయించినప్పటికి రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర దక్కడం లేదు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయక పోవడంతో తమ పంటను రైతులు దళారలకు, ప్రవేట్ వ్యాపారులకు విక్రయించాల్సి వస్తుంది. ఇదే అదునుగా భావించి మొక్కజొన్న కొనుగోళ్లలో దళారులు దందాను కొనసాగిస్తుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వాణిజ్య పంటలు నష్టాన్ని మిగల్చడంతో ప్రత్యామ్నాయంగా రైతులు మొక్కజొన్న సాగును చేపట్టినప్పటికి ధర ఆశాజనకంగా లేకపోవడంతో పెట్టుబడులు కూడా గిట్టుబాటు కావడంలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. భద్రాద్రి జిల్లాలో రబీలో 31,729 ఎకరాలలో రైతులు మొక్కజొన్న సాగు చేపట్టారు. పత్తి పంట దెబ్బతినడంతో ముందుగానే రైతులు దానిని తొలగించి మొక్కజొన్న సాగు చేశారు. లక్షలాది రూపాయాల పెట్టుబడి పెట్టి పంటను పండించారు. మొక్కజొన్నసాగు లాభా లు తెచ్చిపెడుతుందని ఆశపడ్డారు. కాగా గిట్టుబాటు ధర లభించకపోవడంతో వారి ఆశలు ఆవిరయ్యాయి.

పంటను పండించడానికి రైతులు ఎకరానికి రూ. 40వేల నుంచి రూ. 45 వేల వరకు పెట్టుబడి పెట్టారు. కంకులు విరిసి మిషన్ ద్వారా గింజలు పట్టడానికి ఎకరానికి రూ. 12వేలు ఖర్చు అవుతుందని రైతులు అంటున్నారు. గత ఏడాది రూ. 10 వేలు మాత్రమే తీసుకోగా ఈ ఏడాది పెరిగిందని రైతులు తెలిపారు. దిగుబడులు కూడా బాగా తగ్గిపోయాయి. గత ఏడాది ఎకరానికి 40 క్వింటాలు రాగా ఈ ఏడాది 20 నుంచి 30 క్వింటాల లోపే వచ్చాయి. గిట్టుబాటు అయ్యే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు.

మొక్కజొన్న కొనుగోళ్లకు సంబంధించి ప్రభుత్వం కొనుగోళ్ల కేంద్రాలను గ్రామాలలో ఏర్పాటు చేయకపోవడంతో రైతులు మరింతగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పాడింది. గ్రామాలలోకి వచ్చే ప్రవేట్ వ్యాపారులకు, దళారులకు రైతులు పంటలను విక్రయించాల్సి వస్తుంది. ప్రభుత్వం క్వింటాకు రూ. 2,225ల మద్దతు ధరను ప్రకటించింది. కాగా దళారులు మాత్రం రైతుల వద్ద నుంచి రూ. 1900లకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. రైతులను బురిడి కొట్టించి తక్కువ ధరకు పంటను కొనుగోలు చేస్తున్నారు. తమ అవసరాలను ఆసరాగ తీసుకుని దళారులు దోపిడి చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మద్దతు ధర దక్కడం లేదు

● దుద్దుకూరి అశోక్, జూలూరుపాడు



వాణిజ్య పంటలు సాగుచేసి నష్టపోవడంతో రెండున్నర ఎకరాలలో మొక్కజొన్న పంట సాగు చేశాను. పంటను విక్రయిద్దామంటే ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర దక్కకపోవడంతో నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటుచేయకపోవడంతో పంటను విక్రయించడానికి ఇబ్బందులకు గురికావాల్సి వస్తుంది.

పెట్టుబడులు కూడా రావడం లేదు

● శశిధర్ రైతు, వెంగన్నపాలెం



కౌలుకు తీసుకుని ఎక రం విస్తీర్ణంలో మొక్కజొన్న సాగు చేశాను. రూ. 50వేల వరకు పెట్టుబడి పెట్టినప్పటికి 20 క్వింటాల లోపు మాత్రమే దిగుబడి వచ్చింది. ప్రభుత్వం మొక్కజొన్నలకు క్వింటాకు రూ. 2,225 ల మద్దతు ధర ప్రకటించగా గ్రామాలలో దళారులు మాత్రం రూ. 1900లకే కొనుగోలు చేస్తుండటంతో విస్మయాన్ని కలిగిస్తుంది. పెట్టిన పెట్టుబడులు కూడా గిట్టుబాటు అయ్యే పరిస్థితి లేదు.

మారుమోగిన రామ నామం

(మొదటి పేజీ తరువాయి)

ఏఈవో శ్రావణ్‌కుమార్ స్వామి వారి పాదాలను శిరస్సుపై ధరించి దేవస్థానం ప్రధాన అర్చకులు విజయరాఘవన్, వేద పండితులు, జైశ్రీరామ్ జై జైరామ్ అంటూ నడుస్తుండగా శ్రీరామదీక్షితులు సైతం రామనామస్మరణ చేశారు.

రామాలయం నుంచి ప్రారంభమైన గిరి ప్రదిక్షణ కల్యాణ మండపం రోడ్డు, ఆర్డీవో కార్యాలయం, బ్రిడ్జి రోడ్డు, కూనవరం రోడ్డు, ఎల్‌ఐసి రోడ్డు, తాతగుడి సెంటర్, రాజవీధి మీదుగా తిరిగి రామాలయంకు చేరుకొంది. ఈ సమయంలో స్థానికులు శ్రీరామ దీక్షితులకు వడపప్పు, మంచినీరు పంపిణీ చేశారు. చివరగా శ్రీరామదీక్షితులు తమ తిరువడిని భద్రుని సన్నిదిలో సమర్పించారు.

ఇదిలా ఉండగా రెండు రాష్ట్రాల నుంచి తరలివచ్చిన శ్రీరామ దీక్షితులకు దేవస్థానం ఉచిత అన్నప్రసాదం అందజేసింది. అలాగే శ్రీరామదీక్షితుల కోసం రాత్రి ప్రత్యేకంగా రథోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. శ్రీ రామదీక్షితుల కోసం ఆదివారం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో పట్టాభిషేకం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో శ్రావణ్ కుమార్, పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, ప్రధాన అర్చకులు అమరవాది విజయరాఘవన్, ఉప ప్రధాన అర్చకులు కోటి శ్రీమన్నారాయనాచార్యులు, అమరవాది గోపాలాచార్యులు, వేద పండితులు ద్వివేదుల సత్యసాయి సన్యాసి శర్మ, వేనూతుల ఆంజనేయ వర ప్రసాద్ శర్మ, వైదిక పరిపాలన సిబ్బంది పాల్గొన్నారు.



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న శ్రీరామదీక్షితులు



రామాలయంలో పౌర సంబంధాల శాఖ జాయింట్ డైరెక్టర్ జగన్, కుటుంబ సభ్యులు

భద్రాద్రి రామయ్యకు స్వర్ణ తులసార్చన

» స్వామి వారి సేవలో పౌర సంబంధాల శాఖ జేడీ

భద్రాచలం, మే 3 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి వారికి శనివారం అర్జిత సేవలో భాగంగా స్వర్ణ తులసార్చన నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. నిత్యకల్యాణ మండపంలో స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ నిర్వహించారు. స్వామి వారిని రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ జాయింట్ డైరెక్టర్ డీఎస్ జగన్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. దేవస్థానం పర్యవేక్షకులు సాయిబాబా ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొనడంతో పాటు లక్ష్మీతాయారు ఆలయం, ఆంజనేయస్వామి వారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పౌర సంబంధాల అధికారి జి.వెంకటరమణ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా పర్ణశాల రాముని కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

దుమ్ముగూడెం, మే3(ఆంధ్రజ్యోతి): పునర్వసు నక్షత్రం సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రం పర్ణశాలలో సీతారాముల తిరుకల్యాణాన్ని ఆలయ ప్రాంగణంలో శనివారం వైభవంగా నిర్వహించారు. పంచామృతాలతో విశేష అభిషేకం, తిరుమంజనం, విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, మాంగల్య ధారణ, కల్యాణ తలంబ్రాల ఘట్టాలను శాస్త్రోపేక్తంగా జరిపించారు. భక్తులు స్వామివారి ఆశీర్వచనంతోపాటు తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయ ఇన్‌చార్జ్ అనీల్‌కుమార్, ఆలయ ఉప ప్రధాన అర్చకులు అమరవాది శ్రీనివాస రామానుజన్, మదన్మోహనాచార్యులు, వెంకటాచార్యులు, వేదపండితులు నరసింహాచార్యులు పాల్గొన్నారు.

వనమాతో నామా భేటీ

పాల్వంచ టౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు శనివారం మాజీ మంత్రి వనమాతో భేటీ అయ్యారు. మండల పరిధిలో ఓ వివాహ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చిన నామా, వనమా వెంకటేశ్వరరావు నివాసానికి వెళ్లారు. వారిద్దరు రాజకీయాలపై కొద్ది సేపు చర్చించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కిలారు నాగేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు మంతపురి రాజుగౌడ్, మండల అధ్యక్షుడు మల్లెల శ్రీరామ్మూర్తి, సొసైటీ ఉపాధ్యక్షుడు కాంపెల్లి కనకేష్, నాయకులు దాసరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అత్యాధునిక వైద్య సేవలందించడానికి ప్రభుత్వం కృషిచేస్తుంది

» ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



50పడకల ఆస్పత్రికి శంకుస్థాపన చేస్తున్న భట్టి

ముదిగొండ, మే 3 (ఆంధ్రజ్యోతి): రోగులకు అత్యాధునిక వైద్యసేవలందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషిచేస్తుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. శనివారం ముదిగొండ మండలంలోని వల్లభి, బాణాపురం, మల్లన్నపాలెం, ముదిగొండ గ్రామాల్లో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ముదిగొండలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 50పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసేందుకు రూ.22కోట్లతో నిర్మించనున్న భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మల్లన్నపాలెం గ్రామంలో రూ.82లక్షలతో పునర్నిర్మించనున్న శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. బాణాపురంలో ఎస్సీ కాలనీ నుంచి మంగాపురం తండా గ్రామం వరకు రూ.8.50కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డు, నాచేపల్లి గ్రామం నుంచి బాణాపురం తండా వరకు రూ.6.75కోట్లతో నిర్మించనున్న ఆర్అండ్‌బీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. బాణాపురంలో జరుగున్న కంఠమహేశ్వరస్వామి ఉత్సవాల్లో పాల్గొన్న భట్టి విక్రమార్క ప్రత్యేక పూజలు చేశారు. ముదిగొండ మండలంలోని 27గ్రామాల్లో రూ.4కోట్లతో నిర్మించనున్న అంతర్గత రహదారులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఇందిరా పాడిపరిశ్రమ సహకార సంఘం పాలశీతలీకరణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ముందుగా వల్లభి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ బిచ్చాల బిక్షం కుమార్తె వివాహానికి హాజరై నూతన వధువరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, అధికారి విజయలక్ష్మి, డీఎంహెచ్‌వో కళావతిబాయి పాల్గొన్నారు.



మ్యాప్‌ను పరిశీలిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కాశయ్య

‘సీతారామ’ జలాల కోసం..

» డిస్ట్రిబ్యూటరీ కెనాల్ నిర్మాణాలకు భూసేకరణ

» నీళ్లు ఇస్తేనే భూములిస్తామన్న రైతులు

జూలూరుపాడు, మే 3(ఆంధ్రజ్యోతి): సీతారామ మెయిన్ కెనాల్ నుంచి గ్రామాలలోని చెరువుల్లోకి గోదావరి జలాలను మళ్లించి రైతులకు సాగునీటిని అందించేందుకు డిస్ట్రిబ్యూటరీ కెనాల్ నిర్మాణాలకు భూసేకరణ చేస్తున్నట్లు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జె.కాశయ్య తెలిపారు. శనివారం జూలూరుపాడు మండలంలోని జూలూరుపాడు, గుండెపుడి, కాకర్ల, పాపకొల్లు పంచాయతీ కార్యలయాల్లో గ్రామసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు రెవెన్యూ గ్రామల పరిధిలో ప్యాకేజ్-2 కింద డిస్ట్రిబ్యూటరి కెనాల్ మేజర్, మైనర్(పిల్ల కాలువల) నిర్మాణాలకు గాను 378 ఎకరాల భూమి అవసరమని అన్నారు. జూలూరుపాడు రెవెన్యూ పరిధిలో 17.12 ఎకరాలు, గుండెపుడిలో 31.29 ఎకరాలు, కాకర్లలో 176 ఎకరాలు, పాపకొల్లు రెవెన్యూ పరిధిలో మేజర్ కెనాల్ నిర్మాణానికి 152.23 ఎకరాలు భూమిని సేకరించాల్సి ఉందన్నారు. జూలూరుపాడు రెవెన్యూ పరిధిలోని రైతులకు గుండెపుడి మెయిన్ కెనాల్ నుంచి నీటిని జూలూరుపాడులోని కాలువలోకి మళ్లించటం జరుగుతుందని తెలపటంతో రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అటునుంచి తమ చెరువుల్లోకి నీళ్ల వచ్చే అవకాశం లేదని వేరే చోట నుంచి తమ గ్రామంలోని చెరువులోకి నీటిని మళ్లించాలని కోరారు. తమ భూములకు నీళ్ల ఇస్తేనే భూములు ఇస్తామని రైతులు అన్నారు.

ఎండదెబ్బ తగలకుండా అప్రమత్తంగా ఉండాలి

జాగ్రత్తలపై అవగాహన కల్పించాలి

భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి. పాటిల్



కొత్తగూడెం, మే 3 (ఆంధ్రజ్యోతి): ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు అవుతున్నందున ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వడదెబ్బ తగలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. శనివారం జిల్లా కలెక్టర్ ఐడీవోసీ కార్యాలయం నుంచి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎండ దెబ్బ తగలకుండ జాగ్రతలు పాటించాలని, ఎండలో బయట తిరగకుండా జాగ్రత్త వహించాలని, అత్యవసర పరిస్థితి అయితే తప్ప ప్రజలు బయటికి రాకూడదని, మధ్యాహ్నం 12 గంటల నుంచి 4గంటల మధ్యలో ఇళ్ల నుంచి బయటకు రావొద్దని ప్రజలకు తెలిపారు. ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరిగిపోతున్న నేపథ్యంలో వడదెబ్బలు, ఇతర సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని వివరించారు. వడదెబ్బ తగిలిన వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఎండాకాలంలో నిలిపి ఉన్న వాహనాల్లో పిల్లలు, పెంపుడు జంతువులను వదలవద్దని, మధ్యాహ్నం సమయంలో వంట నివారించాలని, ఎండల్లో పని చేయవద్దని, టీ, కాఫీ, స్వీట్స్ చల్లని డ్రింక్స్ తీసుకోవద్దని, చెప్పులు లేకుండా బయట నడవ వద్దన్నారు. చిన్నారులు, వయోవృద్ధులు ఇంటికే పరిమితం కావాలని, ప్రతి రోజు సరిపడ నీరు తీసుకోవాలని, వదులుగా ఉన్న దుస్తువులను ధరించాలని, బయటికి వెళ్లేటప్పుడు గొడుగు, టోపీని ధరించాలని వివరించారు. ఎండలోపని చేసే కార్మికులు తరుచుగా నీటితోపాటు ఓఆర్ఎస్ ద్రావణాన్ని తీసుకోవాలని తద్వార వడదెబ్బ నుంచి శరీరాన్ని కాపాడుకోవచ్చన్నారు.

హెచ్‌ఆర్‌డీ జీఎంగా బాధ్యతలు స్వీకరించిన రవి



రుద్రంపూర్, (సింగరేణి) మే 3 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఇండస్ట్రియల్ డిపార్టుమెంట్ ఐఈడీ జనరల్ మేనేజరుగా నియమితులైన బొజ్జా రవి శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఐఈడీ జీఎంగా పని చేసిన సురేష్ పదవీ విరమణ చేయడంతో సింగరేణి యాజమాన్యం రవిని జీఎంగా నియమించింది. రవిని బీఎంఎస్ కార్యదర్శి మాధవ్‌నాయక్ తదితరులు పూలమాలలతో సత్కరించారు.

రైతు సమస్యలపై జాతీయస్థాయిలో ఉద్యమం

» రైతులను మోసం చేసున్న కేంద్ర ప్రభుత్వం

» మావోయిస్టులను చర్చలకు పిలవాలి

» ఇందిరమ్మ ఇళ్లను దళారులు అమ్ముకుంటున్నారు

» మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య



దమ్మపేట సమావేశంలో మాట్లాడుతున్న గుమ్మడి నర్సయ్య

దమ్మపేట, మే3(ఆంధ్రజ్యోతి): రైతు సమస్యలపై, కేంద్రప్రభుత్వం తీసుకువస్తున్న జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధాన చట్టం బిల్లుకు జాతీయ స్థాయిలో రైతులు, ఉద్యమ పార్టీలతో కలిసి ఉద్యమస్తామని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, అఖిలభారత ఐక్య రైతు సంఘం జాతీయ కమిటీ కన్వీనర్ కెచ్చల రంగారెడ్డి అన్నారు. దమ్మపేట న్యూడెక్రసీ మాస్‌లైన్ పార్టీ కార్యాలయంలో శనివారం సాయంత్రం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలు నిర్ణయాలు రైతులకు నష్టం చేసే విధంగా ఉన్నాయని విమర్శించారు. ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు రోజుకు రూ.200 కూడా రావటంలేదని కనీసం రూ.600 చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. మావోయిస్టులను చర్చలకు పిలవాలని, బూటకపు ఎన్‌కౌంటర్ల పేరుతో అమయాక ఆదివాసీలను చంపుతున్నారని ఆయన అన్నారు. బీఆర్ఎస్ నియంతపాలనలతో విసిగివేసారని ప్రజలు కాంగ్రెపార్టీ ఇచ్చి హామీలతో మార్పు కోసం కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చారని కాని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చి హామీలు నెరవేర్చటం విఫలమైందన్నారు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్ల ఇస్తామని మంత్రి ప్రకటనలు చేస్తున్నారని, కొందరు బ్రోకర్లు అర్హులకు దక్కకుండా రూ. 30వేలకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. రైతు సమస్యలుపై ఉద్యమించేందుకు రైతులు, కార్మికులను సమాయత్తం చేస్తామని, దీనిలో భాగంగా ఈనెల 25,26 తేదీలలో దమ్మపేటలో జరిగే అఖిలభారత ఐక్య రైతు సంఘం జిల్లా మహాసభను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈసమావేశంలో పౌరహక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.రవి, బుర్రా వెంకన్న, కిషోర్, రాము, బిక్షం, దుర్గమ్మ పాల్గొన్నారు.

మహిళ మృతిపై విచారణ



విచారణ జరుపుతున్న డాక్టర్ సీతారాం

సత్తుపల్లి, మే3(ఆంధ్రజ్యోతి): ఈనెల 1న ఆపరేషన్ వికటించి ఓ మహిళ మృతిచెందిన సంఘటనపై డిప్యూటీ డీఎంహెచ్‌ఓ టీ.సీతారాం శనివారం విచారణ చేపట్టారు. ఆంధ్రాకు చెందిన టీ.జ్యోత్స్న కడుపులో నొప్పి కారణంగా కుటుంబ సభ్యులుతో కలిసి సత్తుపల్లి వచ్చారు. పట్టణంలోని ఎన్టీఆర్ కాంప్లెక్స్ రోడ్డులోని ఓ స్కానింగ్ సెంటర్‌లో స్కానింగ్ చేయించుకున్నారు. ఎదురుగా ఉన్న ఓ ఆసుపత్రిలో చేరగా వైద్యులు అదేరోజు సర్జరీ చేశారు. ఆమె తర్వాతి రోజు మృతిచెందగా బంధువులు ఆసుపత్రి వద్ద ఆందోళన చేశారు. ఇదే విషయమై శనివారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విచారణ చేపట్టారు. ఆసుపత్రి నిర్వహకుడైన వైద్యుడితో పాటు సర్జరీ చేసిన మరో ఇద్దరు వైద్యులను విచారించారు. తుది నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తానని, అనంతరం చర్యలు ఉంటాయని ఆయన తెలిపారు. కాగా సదరు ఆసుపత్రి వైద్యుడు ఇకపై సర్జరీలు చేయడానికి గానీ, 8కి మించి బెడ్లు వేసి నిర్వహణ చేయడం కానీ చట్టరీత్యా నేరమని చెప్పారు. రోగులు సైతం సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రులలోనే వైద్యం చేయించుకోవాలని, మెరుగైన సేవలను అందిస్తున్నామని చెప్పారు.

నేడు సబ్ జూనియర్ నెట్‌బాల్ ఎంపికలు

ఖమ్మంస్పోర్ట్స్, మే 3(ఆంధ్రజ్యోతి): జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పెద్ద వెంకటగిరి ఉన్నత పాఠశాలలో సబ్ జూనియర్ (అండర్-16) బాలుర, బాలికల నెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపికలు నిర్వహించనున్నట్లు ఆ సంఘ సెక్రెటరీ ఫణికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపికచేసి త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆధార్,పాస్‌పోర్ట్ ఫోటోతో ఉదయం 9 గంటల కల్లా పెద్దవెంకటగిరి స్కూల్ వద్దకు చేరుకోవాలని కోరారు.

ఇద్దరు పాత నేరస్థుల అరెస్ట్

ఏపీకి చెందిన వారిగా గుర్తింపు

65 కేసుల్లో నిందితులు



నేరస్థులను చూపుతున్న పోలీసులు

సత్తుపల్లిరూరల్, మే3(ఆంధ్రజ్యోతి)3: ఇద్దరు పాతనేరస్థులను సత్తుపల్లి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సంఘటన శనివారం సత్తుపల్లిలో జరిగింది. పట్టణ సీఐ టీ.కిరణ్ మాట్లాడుతూ విజయవాడ సమీపంలోని పాయకాపురానికి చెందిన దేవరకోండ రాంబాబు 1989 నుంచి లారీ క్లీనర్‌గా పని చేసేవాడు. ఈక్రమంలో చెడువ్యసనాలకు అలవాటు పడ్డాడు. ఇందుకోసం డబ్బులు చాలకపోవడంతో తెలుగురాష్ట్రాల పరిధిలో దొంగతనాలకు పాల్పడుతూ అనేకసార్లు జైలు శిక్షలు అనుభవించాడు. 2023లో గుంటూరు జైల్‌లోశిక్ష అనుభవిస్తున్న సమపంలో పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం కావూరుకు చెందిన బొమ్మల విజయ్‌తో రాంబాబుకు పరిచయం ఏర్పడింది. ఇద్దరూ కలిసి దొంగతనాలకు పాల్పడుతూ వచ్చిన సొత్తును చిలకలూరిపేటకు చెందిన కొలిశెట్టి నాగరాజుకు విక్రయించుకుని సొమ్ము చేసుకునేవారు.ఈఏడాది ఫిబ్రవరిలో జైలునుంచి విడుదలవ్వగా ఖమ్మం రూరల్, మధిరటౌన్, వైరా, కామేపల్లి, కల్లూరు, సత్తుపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలోని పలు దొంగతనాలు పాల్పడ్డారు. కాగా శనివారం ఉదయం స్థానిక మెట్టాంజనేయి స్వామి ఆలయంలో సమీపంలో ఎస్ఐ ఎస్.వీరేందర్ తన సిబ్బందితో వాహనాలను తనిఖీ చేస్తుండగా ఆటోలో వస్తున్న రాంబాబు, విజయ్‌లు పోలీసులను చూసి పరారవుతుండగా అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరూ కలిసి 65కేసులలో నిందితులని విచారణలో తేలడంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

కర్ణాటకలో కాకర్లపల్లివాసి దుర్మరణం



హేమంత్ (ఫైల్)

సత్తుపల్లిరూరల్, మే3(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఖమ్మం జిల్లాసత్తుపల్లి మండలం కాకర్లపల్లికి చెందిన ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన శనివారం జరిగింది. కాకర్లపల్లికి చెందిన ఈజీఎస్ ఫీల్డ్‌అసిస్టెంట్ పరిమి శ్రీనివాసరావు, శ్రీలత దంపతుల కుమారుడు హేమంత్ (24) కర్ణాటకలోని చిందాసి మండలంలోని ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నాడు. శనివారం విధులు ముగించుకుని ద్విచక్రవాహనంపై వస్తుండగా కారు ఢీకొన్న ప్రమాదంలో హేమంత్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతిచెందడంతో ఆ కుటుంబ సభ్యుల రోదన మిన్నంటింది. ఎంపీడీవో చిన్న నాగేశ్వరరావు, ఈజీఎస్ ఏపీవో ఎం.బాబు, ఎంపీవో కృష్ణ, ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్ మృతుడికి కుటుంబానికి సంతాపం తెలిపారు.

మద్యం మత్తులో ఆత్మహత్య

దుమ్ముగూడెం, మే3(ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన వ్యక్తి భార్యతో గొడవపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దుమ్ముగూడెం మండలం ఆంధ్రకేసరి కాలనీకు చెందిన గుర్రం రాము(44) శుక్రవారం ఉదయం పురుగుల మందు తాగగా, చికిత్స పొందుతూ రాత్రి పదకొండు గంటల సమయంలో మృతిచెందాడు పోలీసుల వివరాల ప్రకారం... గుర్రం రాము కూలి పనులు చేస్తే జీవనం సాగిస్తున్నాడు. ఈనెల2న రాము అతిగా మద్యం తాగాడు. మరోసారి మద్యం తాగేందుకు భార్యను డబ్బులు అడిగాడు. డబ్బులు తన వద్ద లేవని భార్య చెప్పినా వినకుండా ఆమెపై దాడి చేశాడు. డబ్బులు ఇవ్వకపోతే చస్తానని బెదిరించి ఇంట్లోనుంచి వెళ్లిపోయాడు. గ్రామశివారు గోదావరి ఒడ్డున పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. ఇది గమనించిన చుట్టుపక్కల వాళ్ల వైద్య చికిత్సల కోసం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలున్నారు. భర్త చావుపై ఎటువంటి అనుమానం లేదని భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది.

కమ్యూనిస్టు యోధుడు, ప్రముఖ న్యాయవాది గురుప్రసాద్ కన్నుమూత

కొత్తగూడెం,మే3 (ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకుడు, ప్రముఖ న్యాయవాది ఆళ్ల గురుప్రసాదరావు (93) అనారోగ్యంతో శనివారం విశాఖపట్నంలో కన్నుమూశారు. గురు ప్రసాదరావు మృతి పట్ల సీపీఐ సీనియర్ నాయకుడు పువ్వాడ నాగేశ్వరరావు, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాకు, కొత్తగూడెం తాలూకాకు అనేక దశాబ్ధాలపాటు కమ్యూనిస్టు పార్టీకి నాయకత్వం వహించి ప్రజలకు, కార్మికవర్గానికి సేవలు అందించారన్నారు. పాల్వంచ, కొత్తగూడెం, పినపాక, బూర్గంపాడు, భద్రాచలం ప్రాంతంలో పార్టీ విస్తరణకు కృషి చేశారన్నారు. న్యాయవాదిగా అన్యాయానికి గురవుతున్న పేదవర్గాలకు అండగా నిలిచారని కొనియాడారు. ఆదివారం గురుప్రసాద్ మృతదేహాన్ని వైద్య విద్యార్థులకు పరిశోధన నిమిత్తం కొత్తగూడెం ప్రభుత్వ వైద్య కళాశాలకు అప్పగించనున్నట్లు తెలిపారు. పార్టీ శ్రేణులు, అభిమానుల సందర్శనార్థం ఆదివారంఉదయం 9గంటల నుంచి సీపీఐ జిల్లా కార్యాలయంలో గురుప్రసాద్ పార్థీవ దేహాన్ని ఉంచనున్నట్లు తెలిపారు.



రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

దమ్మపేట, మే3(ఆంధ్రజ్యోతి):రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మందలపల్లి హెచ్‌పీ పెట్రోలు బంక్ వద్ద ప్రధాన రహదారిపై శనివారం రాత్రి జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. సిద్దిపేటకు చెందిన బాణోతు గణేష్ (23) తన స్నేహితుడుతో ద్విచక్రవాహనంపై ఏపీలోని జంగారెడ్డిగూడెం వెళ్లాడు. తిరిగిచ వెళుతున్న క్రమంలో మందలపల్లి హెచ్‌పీ బంక్ వద్ద మినీవ్యాన్ డ్రైవర్ ఎలాంటి సిగ్నిల్ ఇవ్వకుండా ఒక్కసారిగా బంక్‌లోకి మలుపు తిప్పటంతో ద్విచక్రవాహనంపై వెళుతున్న గణేష్ వ్యాన్ ఢీకొట్టాడు. ఈ ఘటనలో గణేష్ అతడి స్నేహితుడు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌లో సత్తుపల్లి తరలించారు. చికిత్స చేస్తుండగా గణేష్ మృతి చెందాడు. ఈసంఘటనపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

తలసీమియాను తరిమేద్దాం

ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి



కూరపాటిని సత్కరిస్తున్న ఎంపీ

ఖమ్మంకలెక్టరేట్, మే3(ఆంధ్రజ్యోతి): తలసేమియా చిన్నారుల పాలిట శాపంగా మారకూడదని ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాంరెడ్డి అన్నారు. శనివారం ఖమ్మంలోని ఐఎంఏహాల్లో తలసేమియా సికిల్‌సెల్ సొసైటీ ఆధ్వర్యంలో తలసేమియా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ2024డిసెంబరులో పార్లమెంటు సాక్షిగా తలసీమియా వ్యాధిపై సభలో చర్చకు పెట్టినట్లు తెలిపారు. వ్యాధి నిర్మూలనకు ప్రజల్లో అవగాహన కల్పించడం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్రమైన విధానాన్ని తీసుకురావాలన్నారు. రాష్ట్రంలో తలసీమియా సికిల్ సెల్ సొసైటీ 4500 మంది తలసీమియ బాధితులకు చేస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. ఇప్పటివరకు తలసీమియా సికిల్ సెల్ సొసైటీ సంస్థ ద్వారా 39,974 మందికి పరీక్షలు నిర్వహించినట్లు సొసైటీ సభ్యురాలు రత్నావళి తెలిపారు. జిల్లా కేంద్రంగా 450 మంది పైగా తలసీమియా చిన్నారులకు తమ సంస్థ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో ఎంతో విలువైనసేవలు అందిస్తున్నామని ఆమె తెలిపారు. తలసీమియా సికిల్‌సెల్ సొసైటీ జిల్లా అధ్యక్షులు,పిల్లల వైద్యనిపుణులు డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ ప్రదా మూడువారాలకు ఒకసారి తలసీమియా పేషెంట్‌కు రక్తం అందించాల్సి ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పిల్లల వైద్యనిపుణుడు యలమంచిలి నాగమణి, డాక్టర్ ఖలీగ్, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు కంభంపాటి నారాయణరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కే.జగదీష్‌బాబు తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో శివరతన్ అగర్వాల్, కిరణ్, రక్తదాతలు మిరియాల జగన్ మోహన్, తదితరులు పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడిలో ఇద్దరికి తీవ్ర గాయాలు



పెదం తెగిన పొట్టయ్య

కరకగూడెం, మే3(ఆంధ్రజ్యోతి): మండలంలో వేరువేరు ప్రాంతాల్లో పిచ్చి కుక్కలు కరవడంతో ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన కరకగూడెంలో మండలంలో శనివారం జరిగింది. గ్రామస్థుల వివరాల ప్రకారం.. మండలంలోని పద్మాపురం పంచాయతీ మొగిలితోగు గ్రామానికి చెందిన కొమరం పొట్టయ్య గ్రామస్థులతో కలిసి ఉపాధి పనులకు వెళ్లాడు. పని చేస్తుండగా ఒక్కసారిగా పిచ్చికుక్క దాడి చేయడంతో పొట్టయ్య పెదం పూర్తిగా తెగింది. తోటికూలీలు కరకగూడెం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం 108 వాహనంలో మణుగూరు తరలించారు. మండలంలోని తాటిగూడెం పంచాయతీ ఇప్పచెట్టునేతకానీ గుంపు గ్రామానికి చెందిన గాంధర్ల నరసయ్య ఇంటి వద్ద ఉండగా పిచ్చికుక్క దాడి చేసింది. దీంతో నరసయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రున్ని 108 వాహనంలో మణుగూరు వైద్యశాలకు తరలించారు.

10న నాగస్వరం పుస్తక ఆవిష్కరణ

ఖమ్మంసాంస్కృతికం,మే3(ఆంధ్రజ్యోతి): ప్రముఖకవి కోయి కోటేశ్వరరావు రచించిన కవిత్వ సంకలనం నాగస్వరం ఆవిష్కరణ జాషువా సాహిత్యవేదిక ఆధ్వర్యంలో ఈనెల10న ఖమ్మంలో జరుగనుంది. న్యూఇరా స్కూల్‌లో సాయంత్రం 6 గంటలకు జరిగే ఈసాహిత్యసభలో ప్రముఖ వాగ్గేయ కారుడు గోరేటి వెంకన్న, సాహితీవేత్త గుంటూరు లక్ష్మీనరసయ్య హాజరుకానున్నారు.

18న నెలనెల వెన్నెల

ఖమ్మంభక్తరామదాసు కళాక్షేత్రంలో ప్రతినెలా నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమం నెలనెల వెన్నెల ఈనెల 18న జరుగనుంది. సాయంత్రం 6 గంటలకు జరిగే కార్యక్రమంలో బీవీకే క్రియేషన్స్ కాకినాడ కళాకారులచే తితిక్ష నాటికను ప్రదర్శిస్తారు.



ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ శ్రేణులు

కులగణనతో బలహీన వర్గాలకు న్యాయం

బీజేపీ పాలేరు ఇన్‌చార్జ్ రవికుమార్

నేలకొండపల్లి,మే3(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ నాయకత్వంలోని కేంద్ర క్యాబినేట్ జనగణనతో పాటు కులగణన చేయించాలని తీసుకున్న నిర్ణయంతోబడుగు,బలహీన వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని బీజేపీ పాలేరుఇన్‌చార్జ్ నున్నా రవికుమార్ అన్నారు. శనివారం ఉదయం బీజేపీ నాయకులు, కార్యకర్తలు నేలకొండపల్లిలో ర్యాలీ నిర్వహించారు. కూసుమంచి రోడ్డులో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రాష్ట్రంలోని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్వహించిన కులగణన అంతా తప్పుల తడకన్నారు. రేవంత్ సర్కార్ చేసిన జనగణనలో ఒక్క క్రైస్తవుడు లేక పోవటం హాస్యాస్పదమన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించే కుల,జనగణన ఖచ్చితంగా, నిక్కచ్చిగా ఉంటుందనటంలో ఎటువంటి సందేహం లేదని రవికుమార్ అన్నారు. కార్యక్రమంలో పాగర్తి సుధాకర్,మన్నె కృష్ణారావు, కోటి హనుమంతరావు, సూరేపల్లి జ్ఞానరత్నం, చావా కిరణ్, రమణమ్మ, సుగుణమ్మ, మీగడ గోపి, నున్నా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రాష్ట్రంలోనే మోడల్ నగరంగా ఖమ్మం

- భవిష్యత్ మాస్టర్ ప్లాన్‌తో అభివృద్ధి చేపట్టాలి
- పనుల్లో నాణ్యతపై రాజీపడేది లేదు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న మంత్రి తుమ్మల, ఎంపీ రఘురామరెడ్డి

ఖమ్మంసంక్షేమవిభాగం,మే3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే ఖమ్మం నగరాన్ని మోడల్ నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికయుతంగా అభివృద్ధి పనులు చేస్తున్నామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం 7వ డివిజన్ టేకులపల్లి, 49వ డివిజన్ మామిళ్లగూడెంలో సీసీ రహదారులు, స్మార్ట్‌డ్రెయిన్లు, కల్వర్టులు ఇతర అభివృద్ధి పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం 15 నెలల్లో ఖమ్మంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఖమ్మం నగర భవిష్యత్ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని అధికారులు అభివృద్ధికి కార్యచరణ చేయాలని పిలుపునిచ్చారు. పనుల నాణ్యతలో ఎటువంటి రాజీ పడొద్దని హెచ్చరించారు. పనుల సమయంలో స్థానికంగా ఉన్న పెద్దలు, కార్పొరేటర్లు పనులను తనిఖీలు చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. నాణ్యతపై ఎటువంటి అనుమానాలు ఉన్నా వెంటనే ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్యకు ఫిర్యాదు చేయాలన్నారు. ఖమ్మం నగరానికి ఖాళీ స్థలాలు పెద్ద సమస్యగా మారిందని, ఆయా స్థలాల యజమానులు తమ ఇళ్ల స్థలాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. లేకుంటే కేఎంసీ అధికారులు నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. ప్రధాన రహదారులపై దేవాలయాలు, మసీదులు, చర్చీలు, ఇతర ప్రార్థన మందిరాలు నిర్మాణం చేస్తే వాటిని తొలగించాలని సూచించారు. ఖమ్మం నగరంలో భవిష్యత్ మాస్టర్ ప్లాన్ మేరకు అభివృద్ధి పనులు చేపట్టాలని తెలిపారు. ఎంపీ రామసహాయం రఘురామరెడ్డి మాట్లాడుతూ ఖమ్మం నగరానికి తనవంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఈఈ కృష్ణలాల్, కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

గోశాల సందర్శన

ఖమ్మం నగరంలోని గోపాలపురం గోశాలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సందర్శించారు. గోవులకు ప్రత్యేకంగా పూజలు జరిపారు. గోశాలలో ఎన్నిపశువులు ఉన్నాయని వాటి నిర్వాహణ తీరుపై తెలుసుకున్నారు.

టీడీపీని బలోపేతం చేయాలి

- పాలేరు పరిశీలకుడు అప్పారావు



మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు అప్పారావు

ఖమ్మంరూరల్, మే 3(ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం పార్టీని గ్రామగ్రామానా బలోపేతం చేయాలని ఆ పార్టీ పాలేరు నియోజకవర్గ పరీశీలకుడు మల్లెంపాటి అప్పారావు పార్టీ నాయకులకు సూచించారు. ఏదులాపురం మునిసిపాలిటి పరిధిలోని నాయుడుపేటలోని ఓ ఫంక్షన్ హాల్లో శనివారం టీడీపీ మండల సర్వసభ్యసమావేశం నిర్వహించారు. ఎన్నికల విదివిధానాలను కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. అన్ని గ్రామాల్లో గ్రామ కమిటీల ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సానబోయిన శ్రీనివాస్‌గౌడ్, నాయకులు బండి వేణు, వెంకటేశ్వర్లు, రమణ, సుందర్ రాంరెడ్డి, లహరిన్, గణేష్, రామారావు, నగేష్, తదితరులు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం: గ్రామస్థాయి నుంచి తెలుగుదేశం పార్టీ విస్తరణకు కార్యకర్తలు కృషి చేయాలని టీడీపీ పాలేరు నియోజకవర్గ పరిశీలకులు మల్లెంపాటి అప్పారావు తెలిపారు శనివారం మండలంలోని పాపాయిగూడెంలో పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారిని చైతన్యపరిచి వాటి పరిష్కరించేందుకు కార్యకర్తలు కృషిచేయాలన్నారు. అలాగే సభ్యత్వ నమోదులో నియోజకవర్గాన్ని ఆదర్శంగా ఉంచాలని కోరారు. ఈసమావేశంలో పార్టీ నాయకులు కొండబాల కరుణాకర్, కొప్పుల వెంకటరావు, కొలిశెట్టిబిక్షం, పుసులూరి రమేష్, కెరమేష్, ఉపేందర్, రమేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మున్నేరు భూ నిర్వాసితులకు పరిహారం చెల్లించాలి

ఖమ్మంచర్చికాంపౌండ్, మే3 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం మున్నేరు భూనిర్వాసితులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని, అప్పటి వరకు పనులు చేపట్టవద్దని మున్నేరు భూనిర్వాసితుల ఐక్యవేదిక కన్వీనర్ అల్లిక వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం ఖమ్మంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. గత ఏడాది మున్నేరు వరద కారణంగా అనేక గృహాల్లోకి నీరు చేరిందని తెలిపారు. వరద ప్రవాహం నుంచి తప్పించేందుకు ప్రభుత్వం కాంక్రీట్‌వాల్ ను నిర్మిస్తుందని దీనివల్ల అనేకమంది ఇళ్లు, ఇళ్లస్థలాలు కోల్పోతున్నాయని తెలిపారు. బాధితులకు న్యాయం జరిగేంత వరకు ఆందోళన నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో రమణ, జ్యోతి, పేరమ్మ పాల్గొన్నారు.

శివాలయ పునర్నిర్మాణానికి సహకరించండి



కామేపల్లిలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

కామేపల్లి, మే 3(ఆంధ్రజ్యోతి): శ్రీబాలాత్రి పురసుందరి సమేత సపంచాయతన సహిత ఇష్టకామేశ్వరస్వామి ఆలయ జీర్ణోద్ధరణము, శ్రీగురు హరిహర మహా క్షేత్రం శంకుస్థాపన కార్యక్రమం మే 8న ఉదయం జరగుతున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. శనివారం కామేపల్లిలో గొట్టుపర్తి శివాజీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఆలయ పునర్నిర్మాణానికి భక్తులు అధిక సంఖ్యలో విరాళాలు అందించాలని విన్నవించారు. ఈ ఆలయ నిర్మాణానికి రూ.4కోట్లవరకు ఖర్చు అవుతుందని, దాతలు సహకరించాలని కోరారు. అనంతరం ఆలయ శంకుస్థాపన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో దమ్మలపాటి శివాజీ, జర్పల రామారవు, అంతోటి అచ్చయ్య, భూక్య శ్రీను, అజ్మీరా రాందాస్, అజ్మీరా హరి, కొర్ర రాములు, లర్జున్ తదితరులు ఉన్నారు.

పారిశుధ్య ట్రాక్టర్ల పర్యవేక్షణ తీరుపై విమర్శలు



ఫిట్‌నెస్ ధ్రువపత్రం లేని ట్రాక్టర్

ఖమ్మంసంక్షేమ విభాగం,మే3 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలో పారిశుధ్య నిర్వాహణలో ప్రైవేట్ కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వాహనాల నిర్వాహణ చేపడుతున్నారు. ఐనప్పటికీ కేఎంసీ అధికారులు మాత్రం బిల్లులను బరాబర్‌గా అందిస్తున్నారనే విమర్శలు వెలువడుతున్నాయి. డివిజన్లలోని జవాన్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లుతో కాంట్రాక్టర్లు చేతులు కలిపి పాతకాలం నాటి తుప్పు పట్టిన ట్రాక్టర్లను ప్రైవేట్ కాంట్రాక్టర్లు వినియోగిస్తున్నారు. కేఎంసీ నిబంధనల మేరకు వాహనాలు సమకూర్చటం లేదు. చెత్తను డంపింగ్ సమయంలో పైనటార్పాలిన్ కట్టకపోవటంతో ప్రధాన రహదారులపై చెత్త పడుతోంది. రవాణా ట్రాక్టర్లుకు కనీస నిబంధనల మేరకు రవాణాశాఖ అధికారులతో ఫిట్‌నెస్ ధ్రువపత్రాలు, ఇన్స్‌రెన్స్, పోల్యూషన్ వంటి పత్రాలను కేఎంసీ అధికారులు ఎప్పుటికప్పుడు పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. కానీ డొక్కు ట్రాక్టర్లుకు హాజరు నమోదు చేసి రికార్డులో చేస్తున్నారు. ఆ పైస్థాయిలోని అధికారులు సైతం వాహనాల ఫిట్‌నెస్ చూడకుండానే మార్చి నెల వరకు ప్రైవేట్ పారిశుధ్య ట్రాక్టర్లు బిల్లులు చెల్లించి చేతులు దులుపుకున్నారని విమర్శలు వెలువడుతున్నాయి.

అంకితభావంతో బోధన కొనసాగించండి

ఇంటర్మీడియట్ జిల్లా ప్రత్యేక అధికారి

వైరా,మే3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అంకిత భావం పూర్తి శక్తి సామర్థ్యాలతో విద్యాబోధన కొనసాగించాలని ఇంటర్మీడియట్ జిల్లా ప్రత్యేక అధికారి సీహెచ్.యాదగిరి సూచించారు. ఇంటర్‌బోర్డు కార్యదర్శి కృష్ణ ప్రసాద్ ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లాకు ప్రత్యేక అధికారిగా నియమితులైన యాదగిరి శనివారం వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యే క తరగతుల గురించి ప్రిన్సిపల్ నవీనజ్యోతి, అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తు తవిద్యా సంవత్సరంలో అధ్యాపకులు నూతన విధానాలతో బోధన సాగించాలని పేర్కొన్నారు.సమాజం మెచ్చేవిధంగా బోధన కొనసాగాలని, ఇంటర్మీడియేట్ అడ్మిషన్ల విషయంలో ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించాలని స్పష్టం చేశారు. అడ్మిషన్ల ప్రచార సామగ్రిని ఆవిష్కరించారు.

కులగణన ప్రకటన.. ప్రజా ప్రభుత్వ విజయం

- ప్రభుత్వానికి బీసీలు అండగా ఉండాలి
- ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



భట్టిని సత్కరిస్తున్న ఉద్యోగసంఘాల నాయకులు

ఖమ్మం,మే3(ఆంధ్రజ్యోతిప్రతినిధి): దేశంలో కులగణన చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం తెలంగాణ ప్రజా ప్రభుత్వం, ప్రజల విజయమని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. దేశంలో కులగణన చేస్తామని కేంద్రం ప్రకటించడానికి మార్గదర్శిగా నిలిచిన తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ శనివారం ఖమ్మం ప్రజాభవన్ క్యాంపు కార్యాలయంలో బీసీఉద్యోగుల సంఘం, బీసీ కుల నాయకులు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు భారీ గజమాలతో సన్మానించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భట్టి విక్రమార్క మాట్లాడారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్రానికి పంపించి ఒత్తిడి చేయడంతో పాటు గుజరాత్‌లో జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో తెలంగాణలో జరిగినట్లుగానే దేశం మొత్తం కులగణన సర్వే చేయాలని తీర్మానం చేసి పార్లమెంట్లో గొంతు ఎత్తిన ఫలితంగా కేంద్రం దిగివచ్చి కులగణన చేస్తామని ప్రకటించడం తెలంగాణ ప్రభుత్వం, ప్రజల విజయమని అభివర్ణించారు. కులగణన సర్వేలో కులాల గురించి మాత్రమే కాకుండా ప్రజలకు సంబంధించిన ఆర్థిక, రాజకీయ, ఉద్యోగ అవకాశాలు, సహజ వనరులు అన్ని వర్గాలకు ఎంత వరకు పంచబడ్డాయి?, వారి జీవన ప్రమాణ పరిస్థితులు ఎట్లా ఉన్నాయన్న అంశాలను సేకరించినట్లు తెలిపారు.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమం- అభివృద్ధికి సంబంధించి విధానపరమైన నిర్ణయాల్లో కుల గణన సర్వేలో వచ్చిన అంశాలను పరిగణలోకి తీసుకుంటామన్నారు. ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ సైదులు, బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు మాట్లాడుతూ కులగణను విజయవంతంగా నిర్వహించుటలో భట్టివిక్రమార్క అకుంటిత దీక్ష పట్టుదలతో శాస్త్రీయబద్దంగా నిర్వహించి దేశానికే ఆదర్శంగా నిలిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు, గౌడ, యాదవ, నాయీబ్రాహ్మణ, రజక, పద్మశాలి, విశ్వకర్మ, శాలివాహన, కాపు కులాల నాయకులు గండు యాదగిరి, మన్సూర్, పోతగాని వెంకన్న బెజ్జంకి ప్రభాకర చారి, ఎర్రమల శ్రీనివాస్, చంద్రశేఖర్ గౌడ్,సున్నం రమేష్, పాపారావు యాదవ్, నవీన శ్రీనివాస్, వెంకన్న యాదవ్, రవీంద్ర ప్రసాద్, వెంకట రామకృష్ణ, జైపాల్, యర్రా రమేష్ పాల్గొన్నారు.

ఎస్‌బీఐ సర్వీస్ కస్టమర్ సెంటర్ నిర్వాహకుల మోసం

కారేపల్లి, మే3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎస్‌బీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కస్టమర్ సర్వీస్ సెంటర్ నిర్వాహకులు పలు మోసాలకు పాల్పడుతున్నట్లు పలువురు చెల్లింపుదార్లు వాపోతున్నారు. ప్రధానంగా డ్వాక్రా సంఘాలకు సంబంధించిన మహిళలు చెల్లింపు విషయంలో అనేక అవకతవకలకు పాల్పడుతున్నారని వాపోతున్నారు. ఇటీవల ఓ సీఎస్‌పీ సెంటర్లో ఓ సంఘ సభ్యురాలు రూ.25వేలు చెల్లించింది. అందుకు నిర్వాహకులు రసీదు కూడా ఇచ్చారు. కాని కొన్ని రోజుల తరువాత డ్వాక్రా సంఘానికి చెందిన వారికి డబ్బులు చెల్లించాలని సమాచారం అందడంతో, సదరు సంఘ సభ్యురాలు నిర్వాకులు ఇచ్చిన రసీదుతో ఇచ్చివారిని నిలదీసింది. విషయం బయటపడితే ఇబ్బంది అనుకున్న నిర్వాహకురాలు వచ్చిన సభ్యురాలికి నచ్చచెప్పి ముందుగా రూ.20వేలు చెల్లించారు. మిగతావి రెండు రోజులలో సర్దుబాటు చేస్తానని, ఈవిషయం ఎక్కడచెప్పవద్దని బతిమిలాడినట్లు తెలిసింది. ఇలాగే అనేక మార్లు మోసాలకు పాల్పడుతున్నారని తెలిసింది. ఇదే విషయంపై స్థానిక ఎస్‌బీఐ మెనేజర్‌ను వివరణ కోరగా జరిగిన విషయం తన దృష్టికి వచ్చిందని, పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.

శిల్ప మరణం బాధాకరం: తమ్మినేని



ఖమ్మంరూరల్, మే3(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరెకోడు గ్రామానికి చెందిన తిప్పసముద్రం శిల్ప అనారోగ్యంతో చిన్న వయసులో మృతి చెందటం చాలా బాధాకరమని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం అన్నారు. మండలంలోని ఆరెకోడు గ్రామంలో ఇటీవల మృతిచెందిన శిల్ప దశధిన ఖర్మ శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తమ్మినేని వీరభద్రం హాజరై శిల్ప చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిదంగా కాచిరాజుగూడెంలో ఇటీవల మృతిచెందిన మాజీసర్పంచ్ అద్దంకి తిరుపతమ్మ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్‌రావు, మండల కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యర్రా శ్రీను, జిల్లాకమిటీ సభ్యులు నంద్రా ప్రసాద్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నేతకు ఘననివాళులు

తిరుమలాయపాలెం,మే3(ఆంధ్రజ్యోతి): మండలంలోని చంద్రుతండా మాజీ సర్పంచ్ బోడా మంచానాయక్ తండ్రి ఫకీరా కు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ శనివారం నివాళులరర్పించారు. ఫకీరా ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ చావా వేణు, బి.వీరన్న, బానోతు రవి,బోడ మంచానాయక్ పాల్గొన్నారు.

తండాలకు నిధులు కేటాయించాలి

తిరుమలాయపాలెం, మే3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గిరిజన తండాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం తెలిపారు. శనివారం తిరుమలాయపాలెంలో గిరిజన సంఘం సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు మూడ్‌గన్యానాయక్,రామి,రూప్లా, రేణుక, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు కన్నా ప్రభుత్వ పాఠశాలలే మిన్న

ఖమ్మంరూరల్, మే3(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలల కన్నా ప్రభుత్వ పాఠశాలలే మిన్నఅని రూరల్‌మండల ఎంపీవో శ్రీనివాస్‌రావు అన్నారు. ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని జలగంనగర్ పాఠశాలలో శనివారం బడిబాట కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఉపాధ్యాయులు గ్రామాల్లో ప్రతీ ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు ప్రయివేటు పాఠశాలలకన్నా ఏమాత్రం తక్కువ కాదన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలి

తిరుమలాయపాలెం, మే3(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలులో జాప్యాన్ని నిరసిస్తూ శనివారం మండలంలోని బంధంపల్లిలో సీపీఎం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తెచ్చి రోజులుగడుస్తున్నా వాటిని దిగుమతి చేయడంలేదని దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వర్షం వస్తే ధాన్యం తడుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీన, బింగి రమేష్, నాగేశ్వరరావు, మహేందర్, లింగయ్య , బి.లింగస్వామి, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

సత్తుపల్లిరూరల్, మే3 (ఆంధ్రజ్యోతి): పురుషులతో సమానంగా అన్నిరంగాల్లో మహిళలు పోటీపడుతూ రాణించాలని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, 6వ అదనపు జిల్లా న్యాయాధికారి మారగాని శ్రీనివాసరావు అన్నారు. మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని కిష్టారంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ప్రాజెక్టర్ ద్వారా క్లాసులు నిర్వహించారు. విద్యార్థులకు చట్టాలు, మహిళల హక్కులు, వాటిని వినియోగించుకునే విధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కేబీ.జ్యోత్స్న, టీచింగ్ స్టాఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

సమగ్ర సస్యరక్షణతో అధిక దిగుబడులు

ఎర్రుపాలెం, మే3 (ఆంధ్రజ్యోతి): మామిడిసాగులో రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని మధిర వ్యవసాయరంగ శాస్త్రీయ పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త కె.రుక్మిణిదేవి అన్నారు. మండలంలోని బుచ్చిరెడ్డిపాలెంలో గల రైతువేదికలో మామిడిసాగులో సస్యరక్షణ చర్యలపై శనివారం మామిడి రైతులక అవగాహన నిర్వహించారు. వాతావరణ పరిస్థితులను గమనించి రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు.

త్రివేణి విద్యార్థులకు తుమ్మల,కలెక్టర్ అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మంఖానాపురం హవేలి, మే3(ఆంధ్రజ్యోతి): పదోతరగతి ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన త్రివేణి పాఠశాల విద్యార్థులను మంత్రి తుమ్మల. నాగేశ్వరరావు, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ప్రత్యేకంగా అభినందించారు. శనివారం పాఠశాల ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో విదార్థులు మంత్రిక్యాంప్ కార్యాలయానికి వెళ్లి మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం కలెక్టరేట్‌కు వెళ్లి కలెక్టర్‌ను కలిశారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. భవిష్యత్‌లో ఇంకా మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించినట్లే జీవితంలోనే విజయం సాధించాలని విద్యార్థులను దీవించారు.

క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో ఎంపికైన ప్రియదర్శిని విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్

ఖమ్మంరూరల్,మే3(ఆంధ్రజ్యోతి): పెద్దతండాలోని ప్రియదర్శిని విద్యార్థులు డెలాయిడ్ ఇండియా నిర్వహించిన ఆన్‌లైన్‌ఇంటర్వ్యూల్లో ఎంపికైనట్లు ప్రిన్సిపల్ బి.గోపాల్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో కళాశాల చైర్మన్ నవీన్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు డెలాయిట్‌లో ఎంపిక కావడం గర్వకారణం అన్నారు. విద్యార్థులు టెక్నాలజీ రంగంలో తమ ప్రతిభను నిరూపించుకుంటూ దేశఅభివృద్ధిలో భాగం కావాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థినులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ అట్లూరి వెంకటరమణ పాల్గొన్నారు.



బాధిత కుటుంబాలకు సండ్ర పరామర్శ



ఆశీర్వాదాన్ని పరామర్శిస్తున్న సండ్ర

తల్లాడ, మే3(ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పర్యటించారు. మండలంలోని పినపాక గ్రామంలో అనారోగ్యానికి గురైన తెలంగాణ ఉద్యమకారుడు మోదుగు ఆశీర్వాదంను, ఎక్కిరాల ఆదాంను పరామర్శించారు. మిట్టపల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన ఎన్ఎస్పీ మేజర్ సాగునీటి సంఘం మాజీ ఛైర్మన్ కొండపల్లి చంద్రశేఖర్ కుటుంబాన్ని పరామర్శించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్యాస్ లీక్ ప్రమాదానికి గురైన గుత్తికొండ వినోద్‌కుమార్ ను పరామర్శించారు. రామచంద్రాపురంలో మృతిచెందిన పులి కనకదర్గయ్య, అన్నారుగూడెంలో బయ్యవరపు దర్గయ్య కుటుంబాలను పరామర్శించి వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, దుగ్గిదేవర వెంకట్‌లాల్, నాయకులు వజ్రాల రామిరెడ్డి, కాంపాటి జమలయ్య, నరసింహారావు పాల్గొన్నారు.

ధాన్యం కొనేవారేరి..

» రైతులకు దక్కని కనీస మద్దతు ధర » ప్రైవేటు వ్యాపారులకు విక్రయిస్తున్న రైతులు



తల్లాడలో కల్లంలో ఉన్న ధాన్యం

తల్లాడ, మే3(ఆంధ్రజ్యోతి): రబీలో పండించిన సాధారణ రకం (ఎంటీయూ 1010) ధాన్యం కొనేవారు కరువయ్యారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలవల్ల కూడా ప్రయోజనం లేకపోవడంతో రైతులు గత్యంతరం లేక ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరకు ధాన్యం విక్రయిస్తూ ప్రభుత్వ కనీస మద్దతు ధరను పొందలేకపోతున్నారు. తల్లాడ మండలంలో రబీ సీజన్‌లో 22వేల ఎకరాలలో వరిసాగు చేశారు. సన్నరకాలతో పాటు ఎక్కువ దిగుబడి వస్తుందని ఆశించి సాధారణ రకం ఎంటీయూ1010 ధాన్యం వరిసాగుచేశారు. ప్రస్తుతం సాధారణ రకం ధాన్యం నూర్పిళ్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఎకరానికి 25 క్వింటాళ్ల నుంచి35క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. సాధారణ రకం ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రత్యేకంగా ఐకేపీ ఆధ్వర్యంలో మండలంలోని అన్నారుగూడెం, తెలగవరం, నూతనకల్, రామానుజవరం, కుర్నవల్లి గ్రామాలలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.సాధారణ రకం ధాన్యం క్వింటాకు రూ. 2,300లు కనీస మద్దతు ధర ప్రకటించింది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలో రైతులకు అవసరమైన గన్నీసంచులు సరఫరా లేకపోవడం సాధారణ రకం ధాన్యం తీసుకునేందుకు స్థానిక రైస్‌మిల్లర్లు నిరాకరించడం ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసేందుకు కావాల్సిన లారీలు అందుబాటులో లేకపోవడంతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో సాధారణ రకం ధాన్యం కొనుగోలు మందగించింది. కొనుగోలు కేంద్రాల్లోనే కల్లాల్లో నూర్పిడి చేసిన ధాన్యం రైతులు వారాల తరబడి ఆరబెడుతున్నా రు.17 శాతం లోపు తేమ ఉండాలనే ప్రభుత్వం నిబంధన ఉండగా, వారాల తరబడి కల్లాల్లో ఆరబెట్టడంతో తేమ 10శాతం లోపే వస్తుంది. ఎక్కువరోజులు ఆరబెట్టడం వల్ల ధాన్యం 30శాతం మేరకు పోతుందని బాధిత రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలలో సాధారణ రకం ధాన్యం కొనుగోలులో తీవ్ర జాప్యం జరుగుతుంది. మరోవైపు తరుచు కురుస్తున్న అకాలవర్షాలతో కొందరు రైతులు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించి క్వింటా రూ.1600లకే విక్రయిస్తూ కనీసమద్దతు ధర పొందలేకపోతున్నారు.

15రోజులైనా కొనే దిక్కులేదు

● వెంకటరామారావు, అన్నారుగూడెం రైతు



రబీలో 15 ఎకరాల్లో సాధారణ రకం ఎంటీ యూ 1010 వరి సాగుచేశాను నూర్పిడి చేసి స్థానిక ఐకేపీ కొనుగోలు కేంద్రానికి విక్రయించేందుకు తెచ్చాను. కొనుగోలులో జాప్యం జరగడంతో 15రోజులుగా కల్లాల్లోనే ధాన్యం ఉంది. తరుచూ కురుస్తున్న అకాలవర్షాలతో ఆందోళనకు గురికావాల్సి వస్తుంది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి సాధారణ రకం ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకుని ఆదుకోవాలి.

అంకితభావంతో బోధన కొనసాగించండి

» ఇంటర్మీడియట్ జిల్లా ప్రత్యేక అధికారి యాదగిరి



ప్రత్యేక అధికారి యాదగిరిని సన్మానిస్తున్న దృశ్యం

వైరా, మే 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అంకితభావం పూర్తి శక్తి సామర్థ్యాలతో విద్యాబోధన కొనసాగించాలని ఇంటర్మీడియట్ జిల్లా ప్రత్యేక అధికారి సీహెచ్.యాదగిరి సూచించారు. ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణప్రసాద్ ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లాకు ప్రత్యేక అధికారిగా నియమితులైన యాదగిరి శనివారం వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతుల గురించి ప్రిన్సిపల్ నవీనజ్యోతి, అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో అధ్యాపకులు నూతన విధానాలతో బోధన సాగించాలని పేర్కొన్నారు. సమాజం మెచ్చేవిధంగా బోధన కొనసాగాలని, ఇంటర్మీడియేట్ అడ్మిషన్ల విషయంలో ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించాలని స్పష్టం చేశారు. అడ్మిషన్ల ప్రచార సామగ్రిని ఆవిష్కరించారు. యాదగిరిని ప్రిన్సిపాల్ నవీనజ్యోతి, అధ్యాపకులు సన్మానించారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి: సీపీఎం



లంకపల్లిలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

పెనుబల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి): ప్రశ్నించే వారిని భయపెట్టడం, చంపటమే మోదీ సర్కార్ లక్ష్యమా అని ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చలమాల విఠల్‌రావు డిమాండ్ చేశారు. మండలంలోని లంకపల్లిలో సీపీఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. దోపిడీ వర్గాలకు మావోయిస్టులు వ్యతిరేకంగా ఉన్నారని అందుకే వారిపై కేంద్రప్రభుత్వం అణచివేత చర్యలకు పూనుకుంటుందని, ఆదివాసీ ప్రాంతాల్లో బేస్ క్యాంపులు ఏర్పాటుచేసి సుమారు 25వేలమంది మిలటరీ దళాలతో ఆదివాసీల ప్రాణాలను తీస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు జాజిరి శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి చిలకా విశ్వనాథం, సీపీఎం మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు, గుడిమెట్ల బాబు, పి.పిచ్చయ్య, చిలకా రమణ, కొర్రయ్య, సరస్వతీ, పద్మ, హన్మంతరావు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ సర్వీస్ కస్టమర్ సెంటర్ నిర్వాహకుల మోసం

కారేపల్లి, మే(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎస్‌బీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కస్టమర్ సర్వీస్ సెంటర్ నిర్వాహకులు పలు మోసాలకు పాల్పడుతున్నట్లు పలువురు చెల్లింపుదార్లు వాపోతున్నారు. ప్రధానంగా డ్వాక్రా సంఘాలకు సంబంధించిన మహిళలు చెల్లింపు విషయంలో అనేక అవకతవకలకు పాల్పడుతున్నారని వాపోతున్నారు. ఇటీవల ఓ సీఎస్‌పీ సెంటర్లో ఓ సంఘ సభ్యురాలు రూ.25వేలు చెల్లించింది. అందుకు నిర్వాహకులు రసీదు కూడా ఇచ్చారు. కాని కొన్ని రోజుల తరువాత డ్వాక్రా సంఘానికి చెందిన వారికి డబ్బులు చెల్లించాలని సమాచారం అందడంతో, సదరు సంఘ సభ్యురాలు నిర్వాకులు ఇచ్చిన రసీదుతో ఇచ్చివారిని నిలదీసింది. విషయం బయటపడితే ఇబ్బంది అనుకున్న నిర్వాహకురాలు వచ్చిన సభ్యురాలికి నచ్చచెప్పి ముందుగా రూ.20వేలు చెల్లించారు. మిగతావి రెండు రోజులలో సర్దుబాటు చేస్తానని, ఈవిషయం ఎక్కడచెప్పవద్దని బతిమిలాడినట్లు తెలిసింది. ఇలాగే అనేక మార్లు మోసాలకు పాల్పడుతున్నారని తెలిసింది. ఇదే విషయంపై స్థానిక ఎస్‌బీఐ మెనేజర్‌ను వివరణ కోరగా జరిగిన విషయం తన దృష్టికి వచ్చిందని, పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.

గ్యాస్ లీక్ మృతుల కుటుంబాన్ని ఆదుకోవాలి

తల్లాడ, మే3(ఆంధ్రజ్యోతి): ముగ్గురుప్రాణాలను బలితీసుకున్న గ్యాస్ సిలిండర్ లీకేజీ ఘటన బాధిత గుత్తికొండ వినోద్‌కుమార్ కుటుంబాన్ని ఆదుకోవాలని సీపీఎం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి అన్నారు. ఇటీవల మండలంలోని పాతమిట్టపల్లి గ్రామంలో గుత్తికొండ వినోద్‌కుమార్‌ను శనివారం పరామర్శించారు. పార్టీ ప్రతినిధి బృందం పరామర్శించారు. ఈసందర్భంగా మార్పు స్వచ్ఛంద సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు గుడిమెడ్ల మోహన్‌రావు, రజిత రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. ఈకార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరరావు, నాయకులు కళ్యాణం కృష్ణయ్య, అక్బర్, సత్యమూర్తిపాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సత్తుపల్లిరూరల్, మే3 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మండల పరిధిలోని ప్రతినిత్యం పూజలందుకుంటున్న దేవాలయాలలో దూపదీప నైవేద్య పథకానికి దరఖాస్తు చేసుకోవాలని డీడీఎన్ఎస్ అధ్యక్షుడు యార్లగడ్డ దయానంద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన వారు తమ ఆలయాలను ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉందని, జిల్లాలోని దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యాలయంలో దరఖాస్తును పూర్తి వివరాలతో సమర్పించాల్సి ఉందన్నారు. ఇతర వివరాల కోసం 63096 13255, 99510 41264 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

మున్నేరు భూ నిర్వాసితులకు పరిహారం చెల్లించాలి

ఖమ్మంచర్చికాంపౌండ్, మే3 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం మున్నేరు భూనిర్వాసితులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని, అప్పటి వరకు పనులు చేపట్టవద్దని మున్నేరు భూనిర్వాసితుల ఐక్యవేదిక కన్వీనర్ అల్లిక వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం ఖమ్మంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. గత ఏడాది మున్నేరు వరద కారణంగా అనేక గృహాల్లోకి నీరు చేరిందని తెలిపారు. వరద ప్రవాహం నుంచి తప్పించేందుకు ప్రభుత్వం కాంక్రీట్‌వాల్ ను నిర్మిస్తుందని దీనివల్ల అనేకమంది ఇళ్లు, ఇళ్లస్థలాలు కోల్పోతున్నాయని తెలిపారు. బాధితులకు న్యాయం జరిగేంత వరకు ఆందోళన నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో రమణ, జ్యోతి, పేరమ్మ పాల్గొన్నారు.

10న నాగస్వరం పుస్తక ఆవిష్కరణ

ఖమ్మంసాంస్కృతికం, మే3(ఆంధ్రజ్యోతి): ప్రముఖకవి కోయి కోటేశ్వరరావు రచించిన కవిత్వ సంకలనం నాగస్వరం ఆవిష్కరణ జాషువా సాహిత్యవేదిక ఆధ్వర్యంలో ఈనెల10న ఖమ్మంలో జరుగనుంది. న్యూఇరా స్కూల్‌లో సాయంత్రం 6 గంటలకు జరిగే ఈసాహిత్యసభలో ప్రముఖ వాగ్గేయ కారుడు గోరేటి వెంకన్న, సాహితీవేత్త గుంటూరు లక్ష్మీనరసయ్య హాజరుకానున్నారు.

సమగ్ర సస్యరక్షణతో అధిక దిగుబడులు

» శాస్త్రవేత్త రుక్మిణీదేవి



రైతులకు ఉద్యానదర్శిని పుస్తకాలను అందిస్తున్న శాస్త్రవేత్త రుక్మిణీదేవి

ఎర్రుపాలెం, మే3 (ఆంధ్రజ్యోతి): మామిడిసాగులో రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటిస్తే అదిక దిగుబడులు సాధించవచ్చని మధిర వ్యవసాయరంగ శాస్త్రీయ పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త కె.రుక్మిణీదేవి అన్నారు. మండలంలోని బుచ్చిరెడ్డిపాలెంలో గల రైతువేదికలో మామిడిసాగులో సస్యరక్షణ చర్యలపై శనివారం మామిడి రైతులక అవగాహన నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులను గమనించి రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని, నీటి ఎద్దడి కారణంగా ఎదిగిన కాయలు పక్వానికి రాకుండా రాలిపోతుంటాయన్నారు. ఈప్రాంతంలో తోటలను పరిశీలంచి పరిశోధన చేశామన్నారు. మామిడి కాయ బరువు 180 గ్రామల నుంచి 220 గ్రాముల వరకు ఉండాల్సి ఉండగా దిగుబడి రాక చెట్లమీదక కాయలు 70గ్రాముల నుంచి 100 గ్రాములకు మించి ఉండడం లేదన్నారు. అనంతరం రైతులకు మామిడిలో సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ఏవో బి.సాయిశివ, హెచ్‌వో విష్ణు, ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు భరత్, నాగస్వాతి, విజయ్‌కృష్ణ, ఏఈవోలు కృష్ణకుమారి, దుర్గాప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఎంపిక

సత్తుపల్లిరూరల్, మే3 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లిలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో ఈ విద్యాసంవత్సరానికి గానూ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులను శనివారం లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేశారు. రిజర్వేషన్ నియమాల ప్రకారం... నాన్ మైనార్టీలో 20సీట్లకు గానూ బీసీ-10, ఎస్సీ-5, ఎస్టీ-3, ఓసీ-2సీట్లను విద్యార్థులకు కేటాయించామని ప్రిన్సిపాల్ కే.వెంకటరామయ్య తెలిపారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వెంకటరామయ్య

గ్రామాల్లో అధ్యాపకుల విస్తృత ప్రచారం

వైరా, మే 3 (ఆంధ్రజ్యోతి): వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. దాంతో పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని కోరుతూ ఈ కళాశాల అధ్యాపకులు శనివారం వివిధ గ్రామాల్లో విస్తృత ప్రచారం చేశారు. ఇంటర్‌బోర్డు ఆదేశాల మేరకు ఈనెల ఒకటి నుంచి ఇంటర్ ప్రథమ సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపల్ ఎల్.నవీన జ్యోతి తెలిపారు. వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సౌకర్యాలను వివరిస్తూ కరపత్రాలు పంచుతూ పోస్టర్ల ద్వారా ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ ఇంగ్లీష్, తెలుగుమీడియాలు ఉన్నాయని, సెకండ్ లాంగ్వేజ్‌లో తెలుగు, హిందీ ఉన్నాయని అలాగే ప్రథమ సంవత్సరం ఒకేషనల్ కోర్సుల్లో ఏఈటీ, ఎంఈ కోర్సులున్నాయని పేర్కొంటూ విద్యార్థులు ఈ కళాశాలలో చేరి సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రచారం చేశారు. ప్రథమ సంవత్సరం హెచ్‌ఈసీలో ఎం.మణిసంపన్న అనే విద్యార్థిని 491 మార్కులు సాధించిందని, అలాగే సెకండియర్‌లో మౌనిక 951 బైపీసీలో సాధించిందని అందువలన వైరా పరిసర ప్రాంతాల్లోని పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థినీ, విద్యార్థులు తమ కళాశాలలో చేరాలని ప్రచారం చేశారు. ఎలాంటి ఫీజు లేకుండా అర్హులకు స్కాలర్‌షిప్, పాఠ్యపుస్తకాలు అందజేస్తామని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కరపత్రాలు, ప్లెక్సీలు, పోస్టర్ల ద్వారా ప్రచారం చేశారు.



కరపత్రాలు పంచుతున్న అధ్యాపకులు

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



న్యాయ విజ్ఞానసదస్సులో పాల్గొన్న విద్యార్థులు

సత్తుపల్లిరూరల్, మే3 (ఆంధ్రజ్యోతి): పురుషులతో సమానంగా అన్నిరంగాల్లో మహిళలు పోటీపడుతూ రాణించాలని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, 6వ అదనపు జిల్లా న్యాయాధికారి మారగాని శ్రీనివాసరావు అన్నారు. మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని కిష్టారంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొజెక్టర్ ద్వారా క్లాసులు నిర్వహించారు. విద్యార్థులకు చట్టాలు, మహిళల హక్కులు, వాటిని వినియోగించుకునే విధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కేబీ.జ్యోత్స్న, టీచింగ్ స్టాఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న పాఠశాల చైర్మన్ జానీమియా

కల్లూరు, మే3 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని తెలంగాణ గ్రామర్ పాఠశాలలో పదవతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను శనివారం ఆ పాఠశాల చైర్మన్ యస్‌కె జానీమియా సన్మానించారు. ఈ ఏడాది పది ఫలితాల్లో తెలంగాణ పాఠశాల తరుపున మండల స్థాయిలో కీర్తిచంద్ర, యల్. కౌశిక్‌సాయి, హస్మితలు నిలిచారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రంజిత్‌రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ కేశవరావు, ప్రిన్సిపాల్ యస్‌కె ఇస్మాయిల్, ఎండీ. అయూబ్, ఉపాధ్యాయులు పాల్గొని అభినందించారు.

'కనీస వసతులు కల్పించాలి'



మాట్లాడుతున్న శివా నాయక్

కారేపల్లి, మే 3(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పనులు జరుగుతున్న ప్రాంతంలో కూలీలకు అవసరమైనా అన్ని మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ పార్టీ నాయకుడు భూక్య శివనాయక్ డిమాండ్ చేశారు. శనివారం మండల పరిధిలోని మేకలతండాలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించి మాట్లాడారు. కూలీలకు అవసరమైన తాగునీరు, ఎండదెబ్బ తగలకుండా టెంట్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి



పెద్ద మునగాలలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

కొణిజర్ల, మే3(ఆంధ్రజ్యోతి): గత పది రోజుల నుంచి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఆరబోసిన రైతులు కాంటాలు వేయక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే రైతుల దగ్గర నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, జిల్లా నాయకుడు తాళ్లపల్లి కృష్ణ కోరారు. శనివారం మండల పరిధిలోని పెద్దమునగాల గ్రామంలో రైతులు ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలించి రైతులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తేమ పేరుతో మిల్లర్లు ఐదు నుంచి పది కిలోలు తరుగుతు తీస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాలలో కాంటాలు వేసిన ధాన్యాన్ని లోడులు వేయకుండా కాలయాపన చేస్తూ రైతులకు నరకచూపిస్తున్నారని తెలిపారు. రైతుల ఇబ్బందులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి చెరుకుమల్లి కుటుంబరావు, కొప్పుల కృష్ణయ్య, యారమాల మాధవరెడ్డి, మంగా చెన్నారావు, జోనబోయిన అంజయ్య, చెరుకుమల్లి మోహన్‌రావు, సీపీఐ నాయకులు అచ్చన శ్రీనివాసరావు, గోపవరం సొసైటీ డైరెక్టర్ సుదర్శన్‌రావు పాల్గొన్నారు.

అఖిల భారత రైతుకూలిసంఘం ఆధ్వర్యంలో మండలంలోని మల్లుపల్లి, గుబ్బగుర్తి తదితర గ్రామాల్లో రైతులు కల్లాల్లో, కొనుగోలు కేంద్రాలలో ఆరబోసిన ధాన్యాన్ని ఆ సంఘం జిల్లా నాయకులు షక్ ఖాసీం పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి ఇబ్బందులను తెలుసుకున్నారు.

మధిరరూరల్‌లో...

మధిరరూరల్: మధిర మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోలు చేయకుండా పదిరోజుల నుంచి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని సీపీఎం నాయకులు ఆరోపించారు. తక్షణమే వరి ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం మధిరలో మార్కెట్ యార్డు వద్ద మధిర, విజయవాడ రహదారిపై సీపీఎం నాయకులు రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సీపీఎం డివిన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు మాట్లాడుతూ పదిరోజులు గడుస్తున్నా కొనుగోలు కేంద్రంలో రైతులను పట్టించుకునే నాధుడే కరువయ్యారన్నారు. అధికారులు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఇచ్చిన హామీ మేరకు రాస్తారోకో విరమించారు. ఈకార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు శీలం నరసింహారావు, మందా సైదులు, పట్టణ కార్యదర్శి పడకంటి మురళి, డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు పాపినేని రామనరసయ్య, రాధాకృష్ణ, శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



మధిరరూరల్‌లో రైతులతో మాట్లాడుతున్న నాయకులు

తల్లాడలో....

తల్లాడ, మే3(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని తెలంగాణ రైతుసంఘం జిల్లాకార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. శనివారం మండలంలో తెలంగాణ రైతుసంఘం ఆధ్వర్యంలో అన్నారుగూడెం, నరసింహారావుపేట, గోపాలపేట గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి మాట్లాడారు. గడిచిన 20రోజులుగా ధాన్యం కల్లాల్లో రాసులు పోసి కొనుగోలు కోసం రైతులు ఎదురుచూస్తున్నారన్నారు. కొన్ని కొనుగోలు కేంద్రాల్లో గన్నీసంచులు సరఫరా చేయకపోవడంతో కాంటా వేయడంలేదని గన్నీసంచులు అవసరమైన మేరకు సరఫరా చేయాలన్నారు. అకాలవర్షాలతో రైతులు ఇబ్బందుల పడుతున్నారన్నారు. మరోవైపు మిల్లర్లు దీనిని ఆసరగా చేసుకుని క్వింటాక 5నుంచి10కేజీలు తురుగు పేరుతో కట్టింగ్ పెట్టడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. జిల్లాలో ఉన్న ముగ్గురు మంత్రులు తమ బాధ్యతగా భావించి ధాన్యం రైతులకు నష్టం జరగకుండా ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతులతో కలిసి రైతుసంఘం ఉద్యమం ఉధృతం చేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో నల్లమోతు మోహనరావు, బొంతు సమత, పేరసాని వెంకటేశ్వరరావు, పుల్లి వెంకటనరసయ్య, కృష్ణయ్య , చీకటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



తల్లాడలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న నాయకులు

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

పెనుబల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి): జనగణన, కులగణన నిర్వహించాలని కేంద్ర కేబినెట్ నిర్ణయాన్ని స్వాగతిస్తూ ప్రధాని మోదీ చిత్రపటానికి శనివారం బీజేపీ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆదేశానుసారం పెనుబల్లి మండల బీజేపీ అధ్యక్షుడు బొర్రా నర్సింహారావు ఆధ్వర్యంలో వీఎంబంజర్ రింగ్‌సెంటర్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈవీ. రమేష్, జిల్లా అధికార ప్రతినిధి పడిగల మధుసూదన్, జిల్లా కౌన్సిలర్ ఓరుగంటి రాము, నాయుడు గోవర్ధన్, పేర్ల మహేష్, గాయం నాగరాజు, సత్యనారాయణరెడ్డి, కోట సుధాకర్, రామారావు, వినయ్ పాల్గొన్నారు.